# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 146 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | బుధవారం 16 జులై 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 146 16-07-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-




ఒలింపిక్స్‌లోకి క్రికెట్ రీఎంట్రీ.. షెడ్యూల్ రిలీజ్ !

7 లో..





## ఓటరు జాబితాలో లోపాలను సరిచేయాలి

**పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు యాదవ్**

**ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం అఖిలపక్ష సమావేశం...**


**సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఢిల్లీ వచ్చి సమావేశంలో పాల్గొన్న టీడీపీ బృందం**

**ఎన్నికల విధానాల్లో సంస్కరణ, ఓటరు జాబితాల్లో సంస్కరణలపై చర్చ**

అమరావతి జులై 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల విధానాల్లో సంస్కరణలు, ఓటరు జాబితా సవరణలపై చర్చించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం ఢిల్లీలో అఖిల పక్ష సమావేశం నిర్వహించింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు

- తరువాయి 2లో..



## ఏపీకి తెలంగాణ షాక్..

## బనకచర్లపై.. చర్చకు నో..



- కేంద్రానికి ఘాటుగా లేఖ రాసిన తెలంగాణ సర్కార్
- బనకచర్లపై జీఆర్ఎంబీ, సీడబ్ల్యూసీ, ఈఏసీ అభ్యంతరాలు
- అభ్యంతరం చెప్పిన దానిపై చర్చలేమిటని సూటిగా ప్రశ్న
- తాము పంపిన అజెండాపై చర్చలకు సిద్ధమని ప్రకటన

హైదరాబాద్ జులై 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏపీ ప్రభుత్వానికి, తెలంగాణ సర్కార్ షాక్ ఇచ్చింది. బనకచర్ల ప్రాజెక్టుపై చర్చకు ససేమిరా అంటూ కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసింది. బనకచర్లపై జీఆర్ఎంబీ, సీడబ్ల్యూసీ, ఈఏసీ అభ్యంతరాలు తెలిపాయని పేర్కొంది. ఇప్పటి వరకు బనకచర్లకు ఎలాంటి అనుమతులు లేవని తెలంగాణ సర్కార్ లేఖలో ప్రస్తావించింది. చట్టాలను, ట్రిబ్యునల్ తీర్పులను ఉల్లంఘించే బనకచర్ల ప్రాజెక్టుపై చర్చించాల్సిన అవసరం లేదని కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఢిల్లీలో కేంద్ర మంత్రి సమక్షంలో బుధవారం జరిగే తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రుల సమావేశంలో బనకచర్ల ప్రాజెక్టుపై చర్చించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సింగిల్ ఎజెండా ఇచ్చింది. ఇప్పటికే కృష్ణాపై పెండింగ్‌లో



- తరువాయి 2లో..





## యాక్సియం -4 విజయవంతం..

### భూమికి చేరుకున్న శుక్లా బృందం

ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ నుంచి భూమిపైకి క్షేమంగా దిగారు ఇండియన్ ఆస్ట్రోనాట్ శుభాంశు శుక్లా. 2025, జూలై 15వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు వీరి స్పేస్ క్రాఫ్ట్ కాలిఫోర్నియా తీరంలోని సముద్రంలో విజయవంతంగా ల్యాండ్ అయ్యింది. 22 గంటల

- మిగతా 2లో..





## హిందీ మనం ఎందుకు నేర్చుకోవాలంటున్నారు... మరి పీవీ 17 భాషలు నేర్చుకుని గొప్పవాడు కాలేదా?

### సీఎం చంద్రబాబు

**ఢిల్లీలో పర్యటిస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు**

**పీవీ నరసింహారావు సంస్మరణ కార్యక్రమానికి హాజరు**

**పీవీ చారిత్రాత్మక ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చారని కితాబు**

న్యూఢిల్లీ జులై 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీలో జరిగిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు సంస్మరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. 'ది లైఫ్ అండ్ లెగసీ ఆఫ్ పీవీ నరసింహారావు' అనే అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగిస్తూ, దేశానికి,

- తరువాయి 2లో..

# సీమకు జలసిరులు...

## ఈనెల 17న నీటిని విడుదల చేయనున్న చంద్రబాబు

**హంద్రీనీవా ఫేజ్-1 కాలువల సామర్థ్యం పెంపు**

**శరవేగంగా పనులు పూర్తి**

**100 రోజుల్లోనే కాలువ విస్తరణ**

అమరావతి జులై 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

హంద్రీనీవా ఫేజ్-1 కాలువల సామర్థ్యం పెంపుతో రాయలసీమలో తాగు, సాగునీటి కష్టాలు తీరనున్నాయి. కూటమి ప్రభుత్వం వంద రోజుల్లోనే ఈ ప్రాజెక్టు పనులను పూర్తి చేసి చరిత్ర సృష్టించింది. కూటమి ప్రభుత్వం తీసుకున్న వేగవంతమైన నిర్ణయాలు, చూపిన చొరవ ఫలితంగా రాయలసీమకు జలసిరులు అందనున్నాయి. హంద్రీనీవా ఫేజ్-1 కాలువల విస్తరణ పనులు విజయవంతంగా పూర్తి కావడంతో సీమ జిల్లాలు సస్యశ్యామలం అయ్యేందుకు మార్గం సుగమం అయింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 17వ తేదీన నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం మల్యాల పంపింగ్ స్టేషన్ వద్ద విస్తరణ పూర్తైన హంద్రీనీవా కాలువకు నీటిని విడుదల చేయనున్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా వంద రోజుల్లోనే ఈ కాలువ విస్తరణ పనుల లక్ష్యాన్ని పూర్తి చేసింది.



**పరుగులు తీసిన ప్రాజెక్టు పనులు**

రూ.696 కోట్లతో చేపట్టిన ఈ విస్తరణ పనులతో హంద్రీనీవా ఫేజ్-1 కాలువ ప్రవాహ సామర్థ్యం 3,850 క్యూసెక్కులకు పెరిగింది. రాయలసీమకు తాగు, సాగునీరు అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఫేజ్-1, ఫేజ్-2 కాలువ పనులను పరుగులు పెట్టించారు. రోజువారీ లక్ష్యాలను నిర్దేశించి పనులను వేగవంతం చేశారు. ప్రస్తుతం ఫేజ్-1 కాలువ విస్తరణతో అదనంగా 1,600 క్యూసెక్కుల నీటిని తరలించే అవకాశం ఏర్పడింది. దీనితో జీడిపల్లి రిజర్వాయర్‌ను పూర్తి సామర్థ్యంతో నింపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ ప్రాజెక్టు ద్వారా కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లోని ఆయకట్టుకు సాగునీరు, 33 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందనుంది.

**12 ఏళ్ల తర్వాత 40 టీఎంసీల వినియోగం**

మల్యాల నుంచి జీడిపల్లి వరకు 216 కిలోమీటర్ల మేర హంద్రీనీవా కాలువ విస్తరణ పనులు పూర్తి కావడంతో జీడిపల్లి, కృష్ణగిరి, పత్తికొండ,

- తరువాయి 2లో..



### జగన్ పిటిషన్‌పై

## ముగిసిన వాదనలు..

### తీర్పు రిజర్వ్

హైదరాబాద్ జులై 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

హైదరాబాద్‌లోని నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. సరస్వతీ పవర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి సంబంధించిన షేర్ల బదలాయింపు విషయంలో ఈ వివాదం చుట్టుముట్టింది. జగన్ తన తల్లి వైఎస్ విజయమ్మ, సోదరి వైఎస్ షర్మిల తమకు అన్యాయంగా షేర్లను బదలాయించుకున్నారని ఆరోపిస్తూ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు.

**జగన్ తరపు వాదనలు - అక్రమ బదలాయింపు ఆరోపణ**

జగన్ తరపు న్యాయవాది

- తరువాయి 2లో..



## డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కకు లీగల్ నోటీసులు

హైదరాబాద్ జులై 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

తెలంగాణ డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క చిక్కుల్లో పడ్డారు. ఆయనకు తెలంగాణ బిజెపి అధ్యక్షుడు రామచంద్ర రావు లీగల్ నోటీసులు పంపించారు. బిజెపి అధ్యక్షుడిగా రామచంద్ర రావు నియామకంపై భట్టి పలు వ్యాఖ్యలు చేశారు. దీనిపై లీగల్‌గా చర్యలు తీసుకొనే క్రమంలో తన అడ్వకేట్ విజయ్ కాంత్‌తో నోటీసులు పంపించారు. భట్టి విక్రమార్క మూడు రోజుల్లో బేషరతుగా క్షమాపణ చెప్పాలని.. లేని పక్షంలో రూ.25 కోట్ల పరువు నష్టం దావా వేస్తానని నోటీసుల్లో హెచ్చరించారు. అంతేకాక క్రిమినల్ కేసులు ఎదురుకోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. అసలేం జరిగిందంటే.. తెలంగాణ బిజెపి అధ్యక్షుడిగా రామచంద్ర రావు నియామకాన్ని పునరాలోచన చేయాలని భట్టి ఇటీవల వ్యాఖ్యలు చేశారు. దళితులు, గిరిజనులను వేధించిన వారికి బిజెపి ఉన్నత పదవులు ఇస్తుందనడానికి రామచంద్ర రావు ఎంపికే ఉదాహరణ అని ఆయన అన్నారు. హెచ్‌సియులో రోహిత్ వేముల ఆత్మహత్యకు కూడా రామచంద్ర రావు కారణమని ఆరోపించారు. ఆయనకు తెలంగాణ బిజెపి అధ్యక్ష పదవి రివార్డు ఇచ్చారని, దానిపై పునరాలోచన చేయాలని భట్టి పేర్కొన్నారు.

## ఏఐఎస్ అధికారులకు ఎన్‌పిఎస్ వాటా 14 శాతం పెంపు

అమరావతి జులై 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఏపీ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. అఖిల భారత సర్వీసుల అధికారులకు నేషనల్ పెన్షన్ పథకం (NPS)కింద ఇచ్చే వాటాను ఏపీలోని కూటమి సర్కార్ పెంచింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఏఐఎస్ అధికారులకు ప్రభుత్వం ఇచ్చే వాటాను 10 శాతం నుండి 14 శాతానికి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో డిప్యుటేషన్‌పై ఉన్న అఖిలభారత సర్వీసు అధికారులకూ వర్తింప జేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్ర సచివాలయం సహా విభాగాధిపతులుగా డిప్యుటేషన్ పై ఉన్న CCS అధికారులకూ

- తరువాయి 2లో..

## మావోలకు భారీ ఎదురుదెబ్బ

### పోలీసుల ఎదుట లొంగిపోనున్న కీలక నేతలు


హైదరాబాద్ జులై 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

'ఆపరేషన్ కగార్' చేపట్టి నుంచి మావోయిస్టులకు ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. మావోయిస్టులపై భద్రతాల బలగాలు ఉక్కుపాదంమోపుతున్నాయి. పలువురు మావోయిస్టులు పోలీసులకు లొగిపోతున్నారు. ఓ వైపు పోలీసులు ఒత్తిడి చేయడంతో పాటు ప్రభుత్వ పునరావాస విధానాలు ప్రభావంతో చాలా మంది మావోలు ఆయుధాలను వదిలేసి జనజీవన స్రవంతి కలిసిపోతున్నారు. సోమవారం ములుగు ఎస్‌పి శబరీష్ ఎదుట ఐదుగురు మావోయిస్టులు లొంగిపోయారు.

ప్రభుత్వం ఎంటనే రూ.25 వేలు తక్షణ సహాయం, పునరావాసం కేంద్రాలను కూడా ఏర్పటు చేస్తోంది. మే నెలలో 20 మంది మావోయిసులు అరెస్టు కగా 8 మంది స్వచ్ఛందంగా లొంగిపోయారు. 'పోరు కన్నా ఊరు మిన్న' అనే కార్యక్రమం ద్వారా మావోలు జనజీవన స్రవంతి కలువాలని తెలంగాణ

- తరువాయి 2లో..





## కోట్ల పెట్టుబడులకు ముందుకొచ్చిన 95 సంస్థలు

### మంత్రి నారా లోకేశ్

అమరావతి జులై 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రాష్ట్రానికి ఐటీ, ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్లు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల ద్వారా కొత్త జీవం పోసేందుకు మంత్రి నారా లోకేశ్ విశేష ప్రయత్నాలు చేస్తున్నారు. నాలుగేళ్లలో 10 లక్షల ఉద్యోగాలు అందించాలనే ఉద్దేశంతో ఆయన అధికార యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఐటీ రంగంలో ఇప్పటివరకు 95 ప్రముఖ సంస్థలు రూ.1 లక్ష కోట్ల పెట్టుబడి ప్రణాళికలు రూపొందించాయి. వీటిలో టీసీఎస్, కాగ్నిజెంట్ సంస్థలకు విశాఖలో భూముల కేటాయింపు పూర్తయినట్టు అధికారులు తెలిపారు. వీరి యూనిట్లు త్వరగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని లోకేశ్ సూచించారు.తాజాగా జరిగిన బెంగళూరు పర్యటనలో ఏఎన్ఎస్ఆర్, సత్వ సంస్థలతో జీసీసీ ఒప్పందాలు కుదిరాయి. ఈ ఒప్పందాల వల్ల రాష్ట్ర యువతకు 35,000 ఉద్యోగాలు లభించనున్నాయి.

- తరువాయి 2లో..

జనరల్ న్యూస్
https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక

# సంపాదకీయం

## పూర్తిస్థాయి సమీక్షతోనే..

దేశీయ విమానయాన రంగాన్ని ఒక కుదుపు కుదిపిన అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా బోయింగ్ 787 ప్రమాదంపై వెలువడిన ప్రాథమిక నివేదిక ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ప్రమాదం జరిగిన దాదాపు నెల తరువాత వెలువడిన ఈ నివేదికలో పేర్కొన్న అంశాలపై జాతీయ స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ భిన్నాభిప్రాయాలు వెలువడుతున్నాయి. విచారణ పూర్తి కాకుండానే నివేదికను బహిర్గతం చేయడం, అందులో పైలట్ల తప్పు ఉందనిపించేలా కొన్ని వ్యాఖ్యలు ఉండటం పట్ల పైలట్ల సంఘం తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. వివాదం తీవ్రమౌతుండటంతో ఇదే తుది నివేదిక కాదని, దీని ఆధారంగా ఎటువంటి నిర్ధారణకు రావద్దని, వ్యాఖ్యలు చేయవద్దని పౌర విమానయాన శాఖ కోరింది. గత నెల 12వ తేదీన జరిగిన ఈ ప్రమాదంలో 260 మంది మరణించిన సంగతి తెలిసిందే. దేశీయ విమానయాన చరిత్రలో జరిగిన అతి ఘోర ప్రమాదాల్లో ఒకటిగా ఈ దుర్ఘటన నిలిచింది.

విమానం గాల్లోకి ఎగిరిన కొద్ది నిమిషాల్లోనే ఇంజన్లకు ఇంధన సరఫరా ఒక్కసారిగా ఆగిపోవడం, మెడికల్ కళాశాల హాస్టల్ భవనాలపై కుప్ప కూలిపోవడం వంటి అంశాలు అత్యంత తీవ్రమైనవని, వీటిని సాధారణ సాంకేతిక లోపాలుగా పరిగణించడానికి ఎమాత్రం వీలులేదని నిపుణులు అంటున్నారు. ఈ నేపథ్యంలోనే జాతీయ, అంతర్జాతీయ నిపుణులతో ఏర్పాటు చేసిన ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఎఎఐబి) ఇచ్చిన ప్రాథమిక నివేదిక ప్రాధాన్యత నంతరించుకుంది. కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌లో నమోదైనట్టుగా పేర్కొన్న పైలట్ల సంభాషణ ప్రమాద సమయంలో నెలకొన్న గందరగోళ, భయానక పరిస్థితిని కళ్లకు కడుతోంది. ఈ నివేదికతో ఇంధన కాలుష్యం, పక్షులు ఢీకొనడం వంటి అంశాలు ఈ ప్రమాదానికి కారణం కాదని తేలినట్లు భావిస్తున్నారు. 15 పేజీల ఈ నివేదికలో ఇంజిన్ 1, ఇంజిన్ 2 యొక్క ఇంధన నియంత్రణ స్విచ్‌లు ఒక సెకను తేడాతో ఒక దాని తరువాత ఒకటి 'రన్' నుండి 'కట్‌ఆఫ్' స్థాయికి మారినట్లు (స్విచ్‌లు ఆఫ్ కావడంతో ఇంధన సరఫరా నిలిచిందని) పేర్కొనడం కలకలం రేపుతోంది. '3,505 మీటర్ల పొడవైన రన్‌వే నుండి ఎగరడం ప్రారంభించిన వెంటనే స్విచ్‌లు కట్ ఆఫ్‌కి మారాయి. దీంతో ఇంధన కొరత ఏర్పడింది' అని వివరించారు. ఈ సందర్భంగా పైలట్ల మధ్య చోటుచేసుకున్న సంభాషణను కూడా ప్రస్తావించారు. స్విచ్‌లు ఎందుకు ఆఫ్ చేశావని ఒక పైలట్ ప్రశ్నిస్తుండగా, మరొకరు తాను ఆపలేదని చెబుతున్న విషయం వాయిస్ రికార్డర్‌లో నమోదైంది. దీని ఆధారంగానే పైలట్లమీద సామాజిక మాధ్యమాల్లోనూ, ఇతరత్రా వస్తున్న ఆరోపణలపై పైలట్ల సంఘం స్పందించాల్సి వచ్చింది. ఇన్వెస్టిగేషన్ బ్యూరోలో పైలట్ల ప్రతినిధులు ఒక్కరు కూడా లేకపోవడాన్ని ఆ సంఘం తప్పు పట్టింది. అదే సమయంలో లాభాలను తమ ఖాతాల్లో వేసుకుని లోపాలను సిబ్బందిపై తోసివేసే పెట్టుబడిదారి వ్యవస్థ సహజ లక్షణాన్ని విస్మరించలేం. నిజానికి నివేదిక ప్రకారమే పైలట్ల సంభాషణ పూర్తిగా రికార్డు కాలేదు. ఇంత భయానక సంక్షోభ సమయంలోనూ ఇంజిన్లను పాక్షికంగా పనిచేసేటట్లు పైలట్లు చేయగలిగారని, అయితే, ఆ వెంటనే 'మే డే' పిలుపు ఇచ్చారని నివేదికలో పేర్కొనడం గమనార్హం. విమాన ఇంధన నాణ్యత, బరువు నిర్దేశించిన పరిమితుల్లోనే ఉన్నాయని పేర్కొనడం, పైలట్లు అనుభవజ్ఞులు కావడంతో ఈ పెను విషాదానికి దారి తీసిన అసలు కారణం ఏమిటో ఇంకా వెలుగులోకి రావాల్సి ఉంది. ఈ పరిస్థితే దేశీయ విమాన యాన భద్రతా వ్యవస్థలో దాగి ఉన్న లోపాలపై ఎన్నో ప్రశ్నలను లేవనెత్తుతోంది.

అత్యంత సంక్లిష్టమైన రంగాల్లో ఒకటైన విమానయాన రంగంలో ఏర్పడే చిన్న లోపం కూడా ప్రాణాంతకంగా మారుతుంది. ఇలాంటి సమయంలో విచారణ పూర్తికాకముందే పైలట్లపై, సాంకేతిక సిబ్బందిపైనా నిందారోపణలు చేయడం ఏమాత్రం సబబుకాదు. తప్పు వ్యవస్థల వల్ల జరిగిందో, వ్యక్తుల వల్ల జరిగిందో తేల్చాల్సిన బాధ్యత విచారణ సంఘానిది! ఆధునిక విమాన యానం అనేక అంతర్గత సాంకేతిక వ్యవస్థలపై ఆధారపడి ఉంటుంది. వీటిలో ఏ చిన్నలోపం ఏర్పడినా అది పెను ప్రమాదానికి దారి తీస్తుంది. తాజా ప్రమాదంలో పైలట్లు చివరి వరకు ప్రమాదాన్ని నివారించడానికి చేసిన కృషిని గమనించాలి. ఈ ఘటనను ఒక పాఠంగా తీసుకుని విమానరంగ భద్రతా ప్రమాణాలను, నిర్వహణా విధానాలను, సిబ్బంది శిక్షణా ప్రమాణాలను, అత్యవసర చర్యల ప్రణాళికలను పూర్తిస్థాయిలో సమీక్షించాలి. ప్రైవేటీకరణకు ముందు, తరువాత ఎయిర్ ఇండియాలో చోటుచేసుకున్న మార్పులనూ విశ్లేషించాలి. ఆ సమీక్ష ప్రాతిపదికన భద్రత, నిబద్దత లక్ష్యాలుగా విమానయాన రంగాన్ని పునర్‌నిర్మించాలి.

# తగ్గిన వరద ప్రవాహం.. శ్రీశైలం గేట్లు మూసివేత

**అమరావతి జులై 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



నంద్యాల జిల్లాలో ఉన్న శ్రీశైలం జల విద్యుత్ ప్రాజెక్టుకు వరదనీరు తగ్గుముఖం పట్టడంతో మంగళవారం నీరు కిందకు వదిలే రేడియల్ గేట్లను జలవనరుల శాఖ అధికారులు పూర్తిగా మూసివేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గత వారం రోజుల క్రితం శ్రీశైలంకు వచ్చి గంగమ్మ హారతి చేపట్టి నాలుగు గేట్లు పది అడుగుల మేర ఎత్తి సాగర్ కు నీరు విడుదల చేశారు. ఎగువ ప్రాంతమైన కర్ణాటక, మహారాష్ట్రలో వర్షాలు పడకపోవడం, అక్కడి ప్రాజెక్టు నుంచి నీరు విడుదల కాకపోవటంతో వరద తగ్గుముఖం పట్టడంతో గేట్లను పూర్తిగా బంద్ చేశారు. శ్రీశైలంలో ప్రాజెక్టు నీటిమట్టం 885అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 882.40 అడుగులుగా నమోదైంది. శ్రీశైలం నీటిమట్టం సామర్థ్యం 215.8070 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 201.1205 టీఎంసీలుగా నీటి నిలువలున్నాయి. శ్రీశైలంలోకి ఎగువ ప్రాంతాల నుంచి 55,387 క్యూసెక్కుల నీరు వస్తూ ఉంది. జూరాల నుంచి26,939 క్యూసెక్కులు వస్తున్నాయి. సుంకేసుల జలాశయం నుంచి 28,448 క్యూసెక్కుల నీరు వస్తోంది.

**విద్యుత్ ఉత్పత్తికి ఎడాపెడా నీరు విడుదలకా**

శ్రీశైలం జలాశయానికి వరద తగ్గుముఖం పట్టినప్పటికీ అధికారులు విద్యుత్ ఉత్పత్తికి ఎడాపెడా నీరు వదలటం విశేషం. విద్యుత్ ఉత్పత్తికి మంగళవారం 68,930 క్యూసెక్కుల నీటిని ఉపయోగించారు. ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ ఉత్పత్తికి 33,615 క్యూసెక్కుల ద్వారా 32.43 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్నారు. తెలంగాణ జల విద్యుత్ కోసం 35,315 క్యూసెక్కుల నీటిని ఉపయోగించి 37.26 మిలియన్ల యూనిట్ ను ఉత్పత్తి చేస్తున్నారు. జలాశయం నుంచి నీటిని విడుదల చేయటంతో రైతుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ లో పంటలు పండించేందుకు రాయలసీమ రైతాంగం ప్రాజెక్టులపైన ఆధారపడి ఉందని పేర్కొంటున్నారు.

## ఓటరు జాబితాలో లోపాలను సరిచేయాలి

ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ (టీడీపీ) తరపున పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు యాదవ్, టీడీపీ ఎంపీలు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాస రావు మాట్లాడుతూ, ఓటరు జాబితాల్లోని లోపాలను సరిచేయాలన్న ఎన్నికల సంఘం లక్ష్యాన్ని స్వాగతించారు. కేంద్ర ఎన్నికల సంఘంపై తమకు పూర్తి నమ్మకం ఉందని స్పష్టం చేశారు. ఓటరు గుర్తింపులో ఆధార్‌ను ఏకైక ఆధారంగా పరిగణించకూడదని సూచించిన టీడీపీ, 11 రకాల గుర్తింపు పత్రాలను అంగీకరించాలన్న ఎన్నికల సంఘం నిర్ణయాన్ని స్వాగతించింది.

**ఆధునిక సాంకేతికత వినియోగం, డూప్లికేట్ ఓట్ల తొలగింపు**

డూప్లికేట్ ఓటర్లను తొలగించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సహాయంతో ఆధునిక సాంకేతికతను వినియోగించాలని పల్లా శ్రీనివాస రావు సూచించారు. ప్రతి ఓటరుకు ప్రత్యేక డోర్ నంబర్ కేటాయించడం ద్వారా డేటా చోరీని నిరోధించి, యూనిక్ ఓటర్ ఐడెంటిటీని సృష్టించవచ్చని ఆయన పేర్కొన్నారు.

**పౌరసత్వ నిర్ధారణపై సుప్రీంకోర్టు తీర్పు ప్రస్తావన**

ఓటరు జాబితా పరిశీలనలో ఎన్నికల సంఘానికి ప్రత్యేక హక్కులు ఉన్నప్పటికీ, పౌరసత్వ నిర్ధారణ వారి అధికార పరిధిలో లేదని, 1995 సుప్రీంకోర్టు లాల్ బాబు హుస్సేన్ కేసు తీర్పును ఆయన గుర్తు చేశారు. అభ్యంతరాలు లేవనెత్తిన వారే ఆధారాలు సమర్పించాలని, ఆధారాలు చూపలేకపోయినంత మాత్రాన ఓటర్ల హక్కును రద్దు చేయడం సరికాదని స్పష్టం చేశారు.

**బీహార్‌లో తొలగింపు ప్రక్రియపై ఆందోళన**

బీహార్‌లో ఓటర్ల తొలగింపు ప్రక్రియ కారణంగా గందరగోళం నెలకొందని, గ్రామీణ ప్రాంతాల్లో అక్షరాస్యత తక్కువగా ఉండటం, ఆధార్ ఉన్నా ఇతర పత్రాలు లేని వారు ఎక్కువగా ఉండటం వల్ల నిజమైన ఓటర్లు తొలగింపుకు గురయ్యే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బీహార్‌లో సుమారు 3 కోట్ల మంది ఓటర్లను ఓటరు జాబితా నుంచి తొలగించడం ఆర్టికల్ 326కు విరుద్ధమని, గుర్తింపు పత్రాలు లేని వారు భారతీయులేనని నిర్ధారించే బాధ్యత ప్రభుత్వ సంస్థలదేనని ఆయన అన్నారు.

**టీడీపీ సిఫార్సులు...**

టీడీపీ తరపున పల్లా శ్రీనివాస రావు, ఓటర్లకు అన్యాయం జరగకుండా న్యాయపరమైన, పారదర్శకమైన విధానాలను అమలు చేయాలని ఎన్నికల సంఘాన్ని కోరారు. ముఖ్యంగా:
డ్రాఫ్ట్ ఓటరు జాబితాలను అన్ని రాజకీయ పార్టీలకు అందజేయాలి.
ఫీల్డ్ లెవెల్ అధికారుల నియామకంలో పారదర్శకతను నిర్వహించాలి.
వాలంటీర్ వ్యవస్థలు, మొబైల్ వాహనాలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో పత్రాల సేకరణకు ప్రభుత్వం సహాయం అందించాలి.
వాట్సాప్ హెల్ప్‌లైన్లు, వార్డు స్థాయి సమస్యా పరిష్కార విధానాలు సమర్థవంతంగా పనిచేయాలి.
పార్టీ బూత్ స్థాయి ప్రతినిధులను అన్ని దశల్లో భాగస్వామ్యం చేయాలి.
ప్రతి పౌరుని ఓటు హక్కును కాపాడేందుకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేయాలి.
బూత్ లెవెల్ అధికారులకు ప్రస్తుతం అందిస్తున్న రూ.250 ప్రోత్సాహకాన్ని పెంచాలి. బూత్ లెవెల్ ఏజెంట్లు, బీఎల్వోలు సమన్వయంతో పనిచేస్తే పని మరింత వేగంగా, సమర్థవంతంగా జరుగుతుంది. ఈ సమావేశంలో తెలుగుదేశం తరపున పల్లా శ్రీనివాస రావుతోపాటు పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, శబరి, కూన రవికుమార్, జ్యోత్స్న పాల్గొన్నారు.

## బనకచర్లపై.. చర్చకు నో..

ఉన్న ప్రాజెక్టులకు అనుమతులు, నీటి కేటాయింపులు, గతంలో కేంద్రం ఇచ్చిన హామీ ప్రకారం పాలమూరు, డిండి ప్రాజెక్టులను జాతీయ ప్రాజెక్టులుగా గుర్తించడం, తుమ్మడిహెట్టి వద్ద నిర్మించిన ప్రాణహిత ప్రాజెక్టుకు 80 టీఎంసీల నీటి కేటాయింపుతో పాటు ఏబీఐపీ సాయం, ఇచ్చంపల్లి వద్ద 200 టీఎంసీల వరద జలాల వినియోగానికి కొత్త ప్రాజెక్టు నిర్మాణం తదితర అంశాలతో ఇప్పటికే ఎజెండాను తెలంగాణ సర్కార్ పంపింది. ఏపీ ఇచ్చిన బనకచర్ల ఎజెండాపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. ఈరోజు ఉదయాన్నే కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం మరో లేఖ రాసింది. రేపటి సమావేశంలో బనకచర్లపై చర్చించాల్సిన అవసరం లేదని లేఖలో స్పష్టం చేసింది. జీఆర్ఎంబీ, సిడబ్ల్యూసీ, ఈఏసీ బనకచర్లపై తీవ్ర అభ్యంతరాలు తెలిపాయని.. ఇప్పటివరకు బనకచర్లకు ఎలాంటి అనుమతులు లేవంటూ పూర్తి వివరాలను ఈ లేఖలో ప్రస్తావించింది. అందుకే చట్టాలను, ట్రిబ్యునల్ తీర్పులన్నీ ఉల్లంఘించే బనకచర్ల ప్రాజెక్టుపై చర్చించాల్సిన అవసరం లేదని ఉటంకించారు. గోదావరి%-%బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై చర్చించటం అనుచితమని తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. ఇలాంటి చర్యలు కేంద్ర ప్రభుత్వ నియంత్రణ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీస్తాయని లేఖలో ప్రస్తావించింది.

## యాక్సియం -4 విజయవంతం..

ప్రయాణం తర్వాత భూమికి సురక్షితంగా తిరిగివచ్చింది. శుభాంశు శుక్లాతోపాటు మరో ముగ్గురు వ్యోమగాములు పెగ్గీ విట్సన్, స్లావోస్ట్ డిజ్నాన్స్, టిబర్ కపు కూడా శుభాంశు శుక్లాతో ఉన్నారు. యాక్జియం-4 మిషన్ లో భాగంగా అంతరిక్ష పరిశోధన కేంద్రానికి వెళ్లిన శుభాంశు శుక్లా టీమ్.. క్షేమంగా భూమికి తిరిగి వచ్చారు. మంగళవారం (జులై 15) మధ్యాహ్నం 3 గంటల 1 నిమిషానికి డ్రాగన్ స్పేస్ క్రాఫ్ట్ కాలిఫోర్నియా లోని శాన్ డియాగో తీరంలో లాండ్ అయ్యింది. 20 రోజుల మిషన్ లో భాగంగా శుభాంశు శుక్లా ఆధ్వర్యంలో యాత్ర, పరిశోధనలను పూర్తి చేసుకుని శుభంగా, క్షేమంగా భూమికి చేరుకున్నారు.

**కోట్లాది మందికి శుభాంశు శుక్లా ప్రేరణను ఇచ్చారన్న మోదీ**

యాక్సియం-4 మిషన్ విజయవంతం కావడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. అంతరిక్ష కేంద్రం నుంచి శుభాంశు శుక్లా సహా నలుగురు వ్యోమగాములతో కూడిన వ్యోమనౌక కాలిఫోర్నియా సమీపంలోని సముద్రంలో దిగింది. ఈ సందర్భంగా మోదీ 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. అంతరిక్షం నుంచి భూమికి తిరిగి వచ్చిన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాను స్వాగతించే భారత ప్రజల్లో తాను కూడా ఒకడినని ఆయన పేర్కొన్నారు. శుభాంశు శుక్లా తన అంకితభావం, ధైర్యం, మార్గదర్శక స్ఫూర్తి ద్వారా కోట్లాది మందికి ప్రేరణ ఇచ్చారని ప్రశంసించారు. ఇది భారత మానవ సహిత అంతరిక్ష మిషన్ గగన్‌యాన్ దిశగా మరో ముందడుగు అని ఆయన అభివర్ణించారు.

## హిందీ మనం ఎందుకు నేర్చుకోవాలంటున్నారు... మరి పీవీ 17 భాషలు నేర్చుకుని గొప్పవాడు కాలేదా?

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు పీవీ నరసింహారావు చేసిన సేవలను కొనియాడారు. ఆయన దేశానికి అనేక రంగాల్లో సేవలు అందించిన గొప్ప నాయకుడని, ఆయన సేవలు మరువలేనివని ముఖ్యమంత్రి అన్నారు. పీవీ నరసింహారావు ఎన్నో చారిత్రాత్మక ఆర్థిక సంస్కరణలను తీసుకువచ్చారని చంద్రబాబు వెల్లడించారు. ఆర్థిక సంస్కరణలు అంటే ముందుగా గుర్తుకు వచ్చే పేరు పీవీ నరసింహారావుదేనని సీఎం స్పష్టం చేశారు. దేశం ఎదుర్కొంటున్న సామాజిక, రాజకీయ, ఆర్థిక సవాళ్లను అర్థం చేసుకున్న నాయకుల్లో పీవీ ఒకరని పేర్కొన్నారు. 1991లో భారతదేశం తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో, సరైన విధానాలు లేక ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నప్పుడు, చారిత్రాత్మక ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని గుర్తు చేసుకున్నారు. పీవీ నరసింహారావు తీసుకున్న చర్యల వల్లే దేశంలో ఐటీ విప్లవం ప్రారంభమైందని ముఖ్యమంత్రి తెలిపారు. ఆయన తీసుకొచ్చిన ఆర్థిక సంస్కరణల ఫలాలను ప్రస్తుతం దేశం అనుభవిస్తోందని అన్నారు. దేశానికి ఆయన చేసిన సేవలను ఎవరూ మర్చిపోలేరని ఉద్ఘాటించారు. పీవీ 17 భాషల్లో అనర్గళంగా మాట్లాడేవారని, తద్వారా ఆయన విజ్ఞానం సంపాదించి గొప్పవాడయ్యారని, కానీ ఇప్పుడు కొందరు హిందీ నేర్చుకోవడం ఎందుకు అని ప్రశ్నిస్తున్నారని చంద్రబాబు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

**పవన్ కళ్యాణ్, లోకేశ్ వ్యాఖ్యల ప్రస్తావన**

ఇటీవల హిందీ భాషపై పవన్ కళ్యాణ్, నారా లోకేశ్ చేసిన వ్యాఖ్యలు కూడా రాజకీయంగా చర్చకు దారి తీశాయి. పవన్ కళ్యాణ్, "తెలుగు అమ్మ అయితే, హిందీ పెద్దమ్మ" అని వ్యాఖ్యానించగా, లోకేశ్ "హిందీ జాతీయ భాష" అని అన్నారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో చంద్రబాబు మాటలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. భాషలపై రాజకీయ అంశాలకంటే విద్య, వికాస దృక్పథం అవసరమన్నదే చంద్రబాబు సందేశం.

## సీమకు జలసిరులు... ఈనెల 17న నీటిని విడుదల చేయనున్న చంద్రబాబు

గాజులదిన్నె సహా రాయలసీమ జిల్లాల్లోని స్థానిక చెరువులను కూడా నీటితో నింపనున్నారు. దీంతో సీమ జిల్లాల్లో భూగర్భజలాలు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. గతంలో హంద్రీనీవా ఫేజ్-1 కాలువ పూర్తి సామర్థ్యం 2,200 క్యూసెక్కులు మాత్రమే ఉండటంతో కేవలం 1-2 సార్లు మాత్రమే వరద సమయంలో 40 టీఎంసీల నీటిని వినియోగించుకున్నారు. ఇప్పుడు కాలువల సామర్థ్యం 3,850 క్యూసెక్కులకు పెరగడంతో, ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం మేరకు 40 టీఎంసీల వరద జలాలను ఈ ఏడాదిలో రాయలసీమ జిల్లాలకు వినియోగించుకునే అవకాశం కలిగింది. నెలకు దాదాపు 4.27 టీఎంసీల చొప్పున నాలుగు నెలల వరద కాలంలో అదనంగా 17.10 టీఎంసీల నీటిని తీసుకునే అవకాశం ఈ విస్తరణ పనుల ద్వారా ఏర్పడింది. హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టుకు కేటాయించిన 40 టీఎంసీల నీరు కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల తాగు, సాగునీటి కష్టాలను తీర్చనుంది. హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-1 ద్వారా నంద్యాల జిల్లాలో 2,906 ఎకరాలు, కర్నూలు జిల్లాలో 77,094 ఎకరాలు, అనంతపురం జిల్లాలో 1,18,000 ఎకరాల ఆయకట్టుకు నీరు అందనుంది. ఫేజ్-2 ప్రాజెక్టులో భాగంగా అనంతపురం జిల్లాలో మరో 2.27 లక్షల ఎకరాలు, కడప జిల్లాలో 37,500 ఎకరాలు, చిత్తూరు జిల్లాలో 1.40 లక్షల ఎకరాల మేర ఆయకట్టుకు నీరు అందనుంది. మొత్తంగా ఫేజ్-1, ఫేజ్-2 ద్వారా 6 లక్షల పైచిలుకు ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగునీరు అందనుంది.

**కూటమి ప్రభుత్వంతోనే మళ్లీ పనులు**

2014-19 మధ్య రూ.4,317 కోట్లతో పాలనానుమతులు ఇచ్చిన అప్పటి టీడీపీ ప్రభుత్వం హంద్రీనీవా కాలువల విస్తరణ పనులను 47 శాతం మేర పూర్తి చేసింది. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, 2025 ఏప్రిల్‌లో మొదలైన విస్తరణ పనులు కేవలం వంద రోజుల్లో పూర్తయ్యాయి. తదుపరి ఫేజ్-2 పనులను కూడా ఈ నెలాఖరుకు పూర్తి చేసి పుంగనూరు, కుప్పంలోని చివరి ఆయకట్టుకు కూడా నీరు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మొత్తం ప్రాజెక్టు కోసం రూ.3,890 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. ఈ ప్రాజెక్టు పూర్తి కావడంతో రాయలసీమలో తాగు, సాగునీటి సమస్యలు పరిష్కారమై, ప్రాంతం అభివృద్ధి పథంలో పయనించేందుకు ఇది ఒక ముందడుగు అని చెప్పవచ్చు.

## జగన్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు..

వాదనలో, తన అనుమతి లేకుండా కుటుంబ సభ్యులు సంస్థలో తన వాటాను బదలాయించారని పేర్కొన్నారు. ఇది కంపెనీ చట్టానికి వ్యతిరేకమని, షేర్ హోల్డర్ అనుమతి లేకుండా షేర్లను బదలాయించడం చెల్లదని వాదించారు. అందుకే ఈ బదలాయింపును రద్దు చేయాలని కోరారు. దీనిపై ట్రిబ్యునల్ సుదీర్ఘంగా వాదనలు విన్నది.

**విజయమ్మ, షర్మిల తరపు సమర్థనలు**

దీనిపై స్పందించిన విజయమ్మ, షర్మిల తరపు న్యాయవాదులు మాత్రం బదలాయింపు చట్టబద్ధంగానే జరిగిందని, ఇది ఓ ముందస్తు ఒప్పందం ప్రకారమే జరిగిందని స్పష్టం చేశారు. ఈ వివాదంపై ఇరుపక్షాల వాదనలు ముగియడంతో, ఎన్సీఎల్టీ తుది తీర్పును రిజర్వ్ చేసింది. త్వరలోనే దీనిపై నిర్ణయం వెలువడనుంది. ఈ తీర్పు కుటుంబ రాజకీయాలపై ప్రభావం చూపే అవకాశముంది.

## ఏఐఎస్ అధికారులకు ఎన్‌పిఎస్ వాటా 14 శాతం పెంపు

వర్తింపు చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి. 2019 ఏప్రిల్ 1వ తేదీ నుంచి వాటా పెంపును అమలు చేయనున్నట్లు ఆదేశాల్లో పేర్కొంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్‌ఉత్తర్వులు జారీ చేశారు.

## మావోలకు భారీ ఎదురుదెబ్బ

ప్రభుత్వ పిలుపునిచ్చింది. మంగళవారం సాయంత్రం పార్టీ కీలక నేత ఆత్రం లచ్చన్న, ఆత్ర అరుణ పోలీసుల ఎదుట లొంగిపోనున్నారు. తెలంగాణ స్టేట్ కమిటీ మెంబర్ ఆత్రం లచ్చన్న, బస్టర్ కమిటీ సెక్రటరీ అరుణ సేవలందిస్తున్నారు.

## కోట్ల పెట్టుబడులకు ముందుకొచ్చిన 95 సంస్థలు

ఒప్పందాలు కుదిరిన సంస్థలతో అధికారులు క్రమం తప్పకుండా సంప్రదింపులు కొనసాగించాలని లోకేశ్ స్పష్టం చేశారు.

**డ్రోన్ సిటీ ప్రాజెక్ట్‌ను వేగవంతం చేయాలి**

కర్నూలు జిల్లా ఓర్వకల్లులో ప్రతిపాదిత డ్రోన్ సిటీ ప్రాజెక్ట్‌ను ఏడాదిలో పూర్తిచేయాలని మంత్రి ఆదేశించారు. వ్యవసాయం, పోలీసింగ్, వాతావరణ రంగాల్లో డ్రోన్ల వినియోగంపై చైతన్య కార్యక్రమాలు జరపాలని సూచించారు.
రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభానికి సిద్ధం స్టార్టప్‌లకు బలం చేకూర్చే రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను త్వరలో ప్రారంభించనున్నట్టు లోకేశ్ ప్రకటించారు. అమరావతిలోని క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్టులో టీసీఎస్, ఎల్ అండ్ టీ, ఐబీఎం భాగస్వాములుగా ఉన్నారని వెల్లడించారు.

**మనమిత్ర సేవలను బలోపేతం చేయాలని సూచన**

మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ సేవలను మరింత విస్తరించాలని మంత్రి సూచించారు. ఇప్పటికే 702 సేవల్లో 535 సేవలు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్లను బ్లాక్ చైన్ ద్వారా అందించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

**ప్రభుత్వ పాఠశాలలకు ఇంటర్నెట్, ఎయిర్‌పోర్టులకు ఫోన్ కనెక్టివిటీ**

రాష్ట్రంలోని 45,000 పాఠశాలల్లో ఇంటర్నెట్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విశాఖ, విజయవాడ, రాజమండ్రి, తిరుపతి ఎయిర్‌పోర్టుల్లో ఫోన్ కనెక్టివిటీ సమస్యల్ని తొలగించాలన్నారు.

## ప్రపంచ అత్యంత ఖరీదైన నగరంగా సింగపూర్..

# టాప్ 10 నగరాలు ఇవే

**వరుసగా మూడోసారి ఈ ఘనత సాధించిన సింగపూర్**

**హాంగ్‌కాంగ్‌ను వెనక్కి నెట్టి రెండో స్థానంలోకి వచ్చిన లండన్**

**టాప్ 10 ఖరీదైన నగరాల్లో షాంఘై, మొనాకో, న్యూయార్క్, ప్యారిస్**



ప్రపంచంలో అత్యంత ఖరీదైన నగరంగా సింగపూర్ నిలిచింది. జూలియస్ బేర్ వార్షిక నివేదిక ప్రకారం, వరుసగా మూడో సంవత్సరం సింగపూర్ ఈ ఘనతను సొంతం చేసుకుంది. కనీసం 1 మిలియన్ డాలర్ల బ్యాంకు బ్యాలెన్స్ కలిగిన వ్యక్తులు కొనుగోలు చేస్తున్న వివిధ రకాల ఉత్పత్తులు, వారు అనుభవిస్తున్న లగ్జరీ ఆధారంగా వారి జీవన వ్యయాన్ని జూలియస్ బేర్ లైఫ్ స్టైల్ ఇండెక్స్ విశ్లేషించి ప్రపంచ ఖరీదైన నగరాల జాబితాను రూపొందించింది. ఈ ఏడాది ఫిబ్రవరి - మార్చి మధ్య సేకరించిన డేటాను పరిగణనలోకి తీసుకున్నట్లు జూలియస్ బేర్ తెలిపింది. టాప్ 10 నగరాలను పరిశీలిస్తే, మొదటి స్థానంలో సింగపూర్ ఉండగా, ఆ తర్వాత వరుసగా లండన్, హాంగ్‌కాంగ్, షాంఘై, మొనాకో, జ్యూరిచ్, న్యూయార్క్, ప్యారిస్, సావో పాలో, మిలాన్ నగరాలు ఉన్నాయి. గత సంవత్సరం రెండో స్థానంలో ఉన్న హాంగ్‌కాంగ్‌ను లండన్ వెనక్కి నెట్టి రెండో స్థానానికి చేరుకుంది. సింగపూర్ అత్యంత ఖరీదైన నగరంగా నిలవడానికి వివిధ కారణాలు ఉన్నాయని విశ్లేషించింది. సింగపూర్ ఆర్థిక, రాజకీయ పరిస్థితులు అందరికీ అనుకూలంగా ఉండటంతో పలువురు అంతర్జాతీయ వ్యాపారులు సింగపూర్ కేంద్రంగా తమ వ్యాపారాలను నిర్వహించేందుకు ఆసక్తి చూపుతున్నారు. గతంలో వెనక్కి వెళ్లిన వ్యాపారులను కూడా తిరిగి రప్పించేందుకు సింగపూర్ సంస్కరణలు చేపట్టింది. దీంతో అక్కడి జీవన వ్యయం ఒక్కసారిగా పెరిగింది. సింగపూర్ వాసులు ఎక్కువగా బంగారం కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపిస్తుంటారు. ప్రధానంగా ఈ అంశం సింగపూర్‌ను అత్యంత ఖరీదైన నగరంగా నిలిచేలా చేసింది. సింగపూర్ ప్రజలు ఆహారం, ఆరోగ్య ఉత్పత్తులు, విద్యపై ఎక్కువగా ఖర్చు చేస్తున్నట్లు నివేదిక పేర్కొంది.





## లోయలో పడ్డ వాహనం..

### 8 మంది మృతి

పిథోరాగఢ్ (ఉత్తరాఖండ్) : పిథోరాగఢ్ లోని మువాని ప్రాంతంలో ఘోర ప్రమాదం జరిగింది. పిథోరాగఢ్ లో యాత్రికులను తీసుకెళ్తున్న వాహనం అదుపు తప్పి లోయలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో 8 మంది యాత్రికులు మరణించగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. లోయలో పడిపోయిన మృతదేహాలను వెలికితీసేందుకు, గాయపడిన వారిని రక్షించేందుకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయి. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## 50 ఏళ్ల క్రితమే నదుల అనుసంధానానికి కె.ఎల్ రావు నాంది పలికారు: నిమ్మల



**అమరావతి జులై 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కరవుతో వచ్చే దుర్భిక్ష పరిస్థితులను పారద్రోలాలంటే నదుల అనుసంధానమే మార్గం అని ఎపి మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ప్రఖ్యాత ఇంజనీర్ డాక్టర్ కె.ఎల్. రావు 124వ జయంతి కార్యక్రమం జరిగింది. దుర్గా ఘాట్ లోని కె.ఎల్. రావు ఘాట్ వద్ద నిమ్మల నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిమ్మల మాట్లాడుతూ..50 ఏళ్ల క్రితమే నదుల అనుసంధానానికి కె.ఎల్ రావు నాంది పలికారని అన్నారు. కెఎల్ రావు స్ఫూర్తిని ప్రధాని నరేంద్ర మోడీ, సిఎం చంద్రబాబు నాయుడు కొనసాగిస్తున్నారని తెలియజేశారు. ప్రఖ్యాత ఇంజనీర్ కె.ఎల్.రావు తెలుగువారు కావడం గర్వకారణం అని నిమ్మల ప్రశంసించారు. 2027 డిసెంబర్ కల్లా పోలవరం ప్రాజెక్టు పూర్తి లక్ష్యం అని చెప్పారు. పట్టిసీమ కాదు వట్టిసీమ అని గతంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అవహేళన చేశారని మండిపడ్డారు. చంద్రబాబు కృషితో పట్టిసీమ పూర్తి వల్ల కృష్ణా డెల్టా సస్యశ్యామలం అవుతోందని అన్నారు. గత వైసిపి ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులపై తీవ్ర నిర్లక్ష్యం వహించిందని ధ్వజమెత్తారు. ఈ ఏడాదిలో ఉత్తరాంధ్రకు పోలవరం ద్వారా నీరు తేవడమే లక్ష్యం అని స్ఫూర్తినిచ్చేలా పనిచేయడమే కెఎల్ రావుకు ఇచ్చే ఘనమైన నివాళి అని నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

## నిమిషకు తాత్కాలిక ఉరట.. మరణశిక్ష వాయిదా వేసిన యెమెన్

**రేపు అమలు చేయాల్సిన మరణశిక్షను వాయిదా వేసిన యెమెన్**

**నిమిష కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా సాయం చేస్తోందన్న విదేశాంగ శాఖ**

**పరస్పర అంగీకారానికి వచ్చి కేసును పరిష్కరించుకునేలా సమయం ఇచ్చేలా ప్రయత్నాలు చేసిన ప్రభుత్వం**



నిమిష ప్రియ మరణశిక్షను యెమెన్ అధికారులు వాయిదా వేశారు. తనను వేధిస్తున్న వ్యక్తిని హత్య చేసినందుకు గాను కేరళకు చెందిన ఈ నర్సుకు యెమెన్ అధికారులు ఉరిశిక్ష విధించారు. రేపు ఈ శిక్షను అమలు చేయాల్సి ఉండగా, భారత అధికారులు యెమెన్ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో ఆమె మరణశిక్ష అమలును యెమెన్ వాయిదా వేసినట్లు భారత విదేశాంగ వర్గాలు వెల్లడించాయి. నిమిష ప్రియ ఉరిశిక్షను ఆపడానికి భారత ప్రభుత్వం తన పరిధిలో సంప్రదింపులు జరిపింది. ఈ విషయంలో భారత ప్రభుత్వం నిమిష కుటుంబానికి అవసరమైన సహాయాన్ని అందిస్తోంది. మృతుడి కుటుంబంతో నిమిష ప్రియ కుటుంబం చర్చల కోసం మరింత గడువు కావాలని భారత్ బలంగా కోరింది. ఈ నేపథ్యంలో చివరి నిమిషంలో మరణశిక్ష అమలు వాయిదా పడింది. ఈ కేసు మొదలైనప్పటి నుంచి నిమిష ప్రియకు అన్ని విధాలా సాయం చేసేందుకు భారత ప్రభుత్వం ప్రయత్నిస్తూనే ఉందని విదేశాంగ శాఖ వర్గాలు తెలిపాయి. నిమిష కుటుంబం, బాధిత కుటుంబం పరస్పర అంగీకారానికి వచ్చి కేసును పరిష్కరించుకునేలా కొంత సమయం ఇచ్చేందుకు ప్రయత్నాలు చేసినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. స్థానిక జైలు అధికారులు, ప్రాసిక్యూటర్ కార్యాలయంతో నిరంతరం సంప్రదింపులు జరిపినట్లు తెలిపింది. ఈ క్రమంలోనే మరణశిక్ష వాయిదా పడినట్లు పేర్కొంది.

# ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి పెట్టాలి





**కొత్తపేట, జూలై 15, (తెలుగురాష్ట్రం విలేఖరి):**

వ్యవసాయాధారిత ప్రాంతమైన అంబేద్కర్ కోనసీమ జిల్లాలో వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే రైతులు ప్రత్యామ్నాయ పంటలపై కూడా దృష్టి పెట్టాలని, ముఖ్యంగా పామాయిల్ సాగుకు మళ్ళాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచించారు. కొత్తపేట మండలం వానపల్లిలో మంగళవారం ఉద్యాన శాఖ, సర్వే సాయి ఎడిబుల్ ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ తోటల విస్తరణ మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పామాయిల్ సాగు వల్ల ప్రయోజనాలను ఉద్యాన శాఖ అధికారులు వివరించారు. అలాగే పామాయిల్ సాగు విధానంపై ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే సత్యానందరావు మాట్లాడుతూ దేశంలో ఆయిల్ డిమాండ్ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఆయిల్ పామ్ సాగుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహం అందిస్తున్నాయన్నారు. మూస విధానాలకు స్వస్తి పలికి ఆదాయ వనరులు ఎక్కువగా ఉన్న పంటల సాగుపై స్థానిక రైతులు దృష్టి పెట్టాలన్నారు. కొత్తపేట నియోజకవర్గంలో ప్రస్తుతం 270 ఎకరాల్లో మాత్రమే పామాయిల్ సాగు జరుగుతోందని, సాగుకు అవసరమైన డ్రిప్ ఇరిగేషన్, ఎరువులపై రాయితీలు, ప్రోత్సాహకాలు ఇస్తున్న నేపథ్యంలో మిగిలిన రైతులు కూడా ఆయిల్ పామ్ సాగుపై దృష్టి పెట్టి వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి బి.వి.రమణ మాట్లాడుతూ దేశంలో ప్రజల అవసరాలకు తగినంత పామాయిల్ సాగు దేశంలో లేకపోవడంతో విదేశాల నుంచి ఆయిల్ దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని, దీనిని దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం పామాయిల్ సాగుకు ప్రోత్సాహం అందిస్తోందని అన్నారు. సాగుకు అవసరమైన మొక్కలను ఉచితంగా అందజేస్తామన్నారు. ఎరువుల కొనుగోలులో రాయితీ ఇస్తారన్నారు. మొక్కలు నాటిన నాలుగో సంవత్సరం నుంచి దిగుబడి వస్తుందన్నారు. ప్రతి ఏటా సుమారు 10 టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని, తద్వారా ఎకరాకు రూ.1.80 లక్షల ఆదాయం వస్తుందనన్నారు. వ్యవసాయ, ఉద్యాన పంటల్లో అత్యధిక ఆదాయం ఆయిల్ పామ్ తోటల పెంపకం ద్వారానే లభిస్తోందన్నారు. రైతులు ఆయిల్ పామ్ సాగు వైపు మళ్ళాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కోకో, జామ, అరటి, కంద, సుగంధ ద్రవ్యాలు తదితర అంతర పంటలు సాగు చేసి ఆదాయం పెంచుకోవడానికి అవకాశాలు ఉంటాయన్నారు. దేశంలోనే అత్యధిక పామాయిల్ దిగుబడి మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే వస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పామాయిల్ సాగు చేస్తున్న రైతులను సత్కరించారు. అలాగే రైతులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వానపల్లి సర్పంచ్ పల్లి భీమారావు, కొత్తపేట సర్పంచ్ బూసి జయలక్ష్మి, టీడీపీ నాయకులు ముత్యాల బాబ్జి, పల్లి ఏసు, కాసా విజయసాగర్, యల్లమిల్లి జగన్మోహనరావు, గబ్బల మూర్తి, బూసి భాస్కరరావు, కొత్తపేట ఉద్యాన శాఖ అధికారి జి.కోటేశ్వరరావు, సర్వే సాయి ఎడిబుల్ ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ జి.ఎం. ప్రభాకరరావు, ఏజిఎం వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.



## అమలాపురంలో జంక్షన్ల అభివృద్ధికి కార్యాచరణ

### - జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం, జూలై 15, (తెలుగురాష్ట్రం విలేఖరి):**

అమలాపురం పట్టణానికి ప్రధాన రహదారిపై ఉన్న ఈదరపల్లి వంతెన ఎగువన, దిగువన ఉన్న జంక్షన్ల అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసినట్లు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ వెల్లడించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ లో మున్సిపల్, ఆర్ అండ్ బి, రెవెన్యూ, ఏపీ ఈడీసీఎల్ విభాగాల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఇటీవల ఆధునికరించిన ఈదరపల్లి వంతెన ఎగువ, దిగువ జంక్షన్లను అమ్ముడ, మున్సిపల్ శాఖల సమన్వయంతో సుందరీకరించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎగువ దిగువ జంక్షన్లలో అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మ్యాప్ ఆధారంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సుందరీకరణ పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఆర్డిఓ కే.మాధవి, ఏపీఈడీసీఎల్ ఎస్ఈ రాజకుమారి, ఆర్ అండ్ బి ఎస్ఈ రాము తదితరులు పాల్గొన్నారు .

## రాజోలు వైసీపీ పార్టీ పరిశీలకులుగా మట్టపర్తి నాగేంద్ర



**అమలాపురం,జులై 15 (తెలుగురాష్ట్రం విలేఖరి):**

అమలాపురం మున్సిపల్ సీనియర్ కౌన్సిలర్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు మట్టపర్తి నాగేంద్ర ను రాజోలు నియోజకవర్గం పరిశీలకునిగా నియమించారు. అమలాపురం పట్టణ అధ్యక్షునిగా గతంలో పనిచేసిన నాగేంద్ర మున్సిపల్ కౌన్సిల్లో కీలక నేత. ఇటీవల రాజోలు నియోజకవర్గ పరిశీలకునుగా ఒంటెద్దు వెంకన్న నాయుడును నియమించి నప్పటికీ ఆయన అమెరికాలోని కుమారుడు వద్దకు వెళ్లిపోయారు. నాగేంద్ర పనితీరును గుర్తించిన జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ఈ బాధ్యతలు అప్పగించారు. నాగేంద్ర మాట్లాడుతూ పార్టీ అధిష్టానం ఇచ్చిన బాధ్యతను పార్టీ విజయానికి కృషి చేస్తానన్నారు.

## గెద్దనపల్లి,కొప్పిగుంట గ్రామాలలో "సుపరిపాలన లో తొలి అడుగు"

**కాట్రేనికోన, జూలై 15 (తెలుగురాష్ట్రం విలేఖరి):**

కాట్రేనికోన మండలం గెద్దనపల్లి,కొప్పిగుంట పంచాయితి పరిధిలో 94, 95, 97 బూత్ లలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు గూర్చి ప్రజలకు వివరించి, ప్రజా సమస్యలను మై టీడీపీ యాప్ లో అప్లోడ్ చేసి ముఖ్యమంత్రి డాష్ బోర్డుకి పంపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గెద్దనపల్లి సర్పంచ్ దంతులూరి సీతారామ కృష్ణంరాజు, మాజీ సర్పంచ్ వనచర్ల నాగేశ్వరరావు, గెద్దనపల్లి నీటిసంఘం అధ్యక్షులు పిన్నమరాజు రంగరాజు, గెద్దనపల్లి యూనిట్ ఇంచార్జ్ గోడి వెంకట్రావు,గెద్దనపల్లి మాజీ ఎంపీటీసీ కముజు లక్ష్మీరమణారావు, కొప్పిగుంట గ్రామకమిటీ అధ్యక్షులు యనమదల మహేశ్వరరావు, బూత్ ఇంచార్జ్ కోరుమిల్లి రాంబాబు, బూత్ ఇంచార్జ్ సంసాని మోహనకృష్ణ, వార్డు మెంబర్ సంసాని గంగాధర్,స్కూల్ చైర్మన్ బొక్కా రవివర్మ, చొల్లంగి వసంతరావు,కో కన్వీనర్ పులపకూర గాంగేయుడు,పి. నారాయణ రావు,పెద్ది%శీ%శెట్టి చక్రి, పెద్ది%శీ%శెట్టి కోటేశ్వరరావు, కొప్పిశెట్టి శ్రీనివాసరావు, బొక్కా ధర్మంశెట్టి, విత్తనాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.








తెలుగురాష్ట్రం దినపత్రిక
https://epaper.teluguraastram.com
బుధవారం 16 జులై 2025

# రైతులకు తోడ్పాటుగా ఉంటూ సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తా : అల్లవరం సొసైటీ అధ్యక్షులు కంకిపాటి గోపి

## -ఎమ్మెల్యే ఆనందరావు సమక్షంలో ప్రమాణ స్వీకారం...



**అల్లవరం, జులై15 (తెలుగురాష్ట్రం విలేఖరి):** రైతులకు సేవలందిస్తూ తోడ్పాటుగా ఉండి సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని అల్లవరం సొసైటీ నూతన అధ్యక్షులు కంకిపాటి గోపాలకృష్ణ అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం నియోజకవర్గం అల్లవరం మండలం సొసైటీ అధ్యక్షుడిగా కంకిపాటి గోపాలకృష్ణ ఏకగ్రీవంగా నియమింపబడి బాధ్యతలను స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, మెట్ల రమణ బాబు, దెందుకూరి సత్తిబాబు రాజు, యాళ్ల దొరబాబు, పెచ్చెట్టి చంద్రమౌళి, వేగిరాజు వెంకట్రాజు, యాళ్ల నాగ సతీష్, గునిశెట్టి చినబాబు, ముత్యాల బాబి, మంగిన వీరబాబు జంగా బుజ్జి ల సమక్షంలో మంగళవారం బాధ్యతలు చేపట్టి ప్రమాణస్వీకారం చేశారు. ముందుగా గోపి స్వగృహం నుండి నాయకులు, అభిమానులు, కూటమి కార్యకర్తల సమక్షంలో ర్యాలీగా సొసైటీ వద్దకు చేరుకుని గోపి సహకార సంఘం అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. గోపాలకృష్ణ మాట్లాడుతూ రైతులకు మేలు చేసే విధంగా సొసైటీ అధ్యక్షుడిగా అందరికీ సమన్యాయంగా బాధ్యతలు నిర్వహిస్తూ మేలు చేసే విధానంలోనే నడుచుకుంటానని సొసైటీ అధ్యక్షుడిగా నాకు ఇచ్చిన అవకాశాన్ని బట్టి జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, చంద్రబాబు, నారా లోకేష్, ఎమ్మెల్యే ఆనందరావు లకు కృతజ్ఞతలు తెలిపారు. వీరబాబు, బుజ్జి మాట్లాడుతూ బాధ్యతలు చేపట్టిన గోపికి శుభాకాంక్షలు తెలుపుతూ రైతులకు అండగా ఉంటూ సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. గోపికి జనసేన బిజెపి టిడిపి నియోజకవర్గ స్థాయి నాయకులు కార్యకర్తలు పుష్పం గుచ్చాలను అందించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండా రాంబాబు, లింగోలు పండు, నాగసుధ కొండా, మానస, రొక్కాల నాగేశ్వరావు, గెద్దాడ శ్రీనివాసరావు, మామిడిశెట్టి శ్రీరామ్, కంకిపాటి అరుణ్, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు





# కూనవరం డ్రైన్ పూడికతీయుట పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు





**కూనవరం, జులై15 (తెలుగురాష్ట్రం విలేఖరి):** కూనవరం డ్రైన్ పూడికతీయుట పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు . ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ లంకె భీమరాజు, మాజీ zptc దేశంశెట్టి లక్ష్మీనారాయణ, బందారు వెంకన్న, ఆకుల బుజ్జి, చిక్కం భీముడు, దంగేటి చిట్టిబాబు మాజీ mpp బొర్రా ఈశ్వరరావు, పెయ్యల దుర్గారావు మరియు తదితరులు పాల్గొన్నారు

# అల్లవరం గ్రామంలో జరిగిన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావ





**అల్లవరం, జులై15 (తెలుగురాష్ట్రం విలేఖరి):** అల్లవరం గ్రామంలో జరిగిన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు , ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, DCMSచైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, వేగిరాజు వెంకటరాజు, పచ్చిమాల ఏడుకొండలు, మామిడిశెట్టి శ్రీరామ్, మాజీ mpp బొర్రా ఈశ్వరరావు, రాసూరి రాంబాబు, నడింపల్లి సుబ్రహ్మణ్యంరాజ, నర్గాని శ్రీను, గెద్దాడ శ్రీను, గుబ్బాల నాగేశ్వరరావు, చిట్టూరి శ్రీను, ముత్యాల బాబీ, బూత్ కన్వీనర్ లు మరియు టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు









బుధవారం గౌరవ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ స్వామి గారి పర్యటన సందర్భంగా గోడి గురుకుల పాఠశాలను పరిశీలించిన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు

# భట్నవిల్లిలోని సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే





**భట్నవిల్లి, జులై15 (తెలుగురాష్ట్రం విలేఖరి):** భట్నవిల్లి గ్రామంలో జరిగిన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, అమలాపురం మండల టిడిపి అధ్యక్షులు చొల్లంగి సాయిబాబు, వీరేష్ కుమార్, మాజీ mpp బొర్రా ఈశ్వరరావు, దంతులూరి వాసురాజు, మాడ మాధవి, గ్రామ కమిటీ అధ్యక్షులు మండలిక సుబ్రహ్మణ్య శర్మ, ప్రధాన కార్యదర్శి నామాడి తారక్ కటికిదల లక్ష్మణస్వామి (పండు), దాకారపు భీమేశ్వరరావు, కాట్రూ శ్రీనివాస్, కడిద వెంకటరావు, ర్యాలీ లోవరాజు, పుణ్యమంతుల వెంకటేశ్వరరావు, మెట్టి ప్రసాద్ జల్లి బాబ్జి, కటికిదల బాలకృష్ణ, పండు సత్యనారాయణ, నామాడి శ్రీనివాసరావు, దాకారపు బాలాజీ, పుణ్యమంతుల రమేష్ దునబోయిన ప్రసాద్, అప్పారి సాగర్, కైరాం రాము, నేదునూరి బాలయ్య, ర్యాలీ వాసు, కొల్లి వెంకటరమణ తోత్తరమూడి బంగారయ్య, నామడి భాస్కరావు, నామాడి సోమరాజు, నామాడి రమేష్,శెట్టిబత్తుల శ్రీను, నామాడి శివ, గిడ్ల చంటి, జీనిపే వెంకట్, దాకారపు ప్రభాకరావు, దాకారపు కిరణ్, పెనుమాల ప్రవీణ్ కుమార్, జీనిపే అప్పు, గుత్తాల సాయిరామ్, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు....





# కూటమి హయాంలోనే పేదలకు మరిన్ని సంక్షేమ ఫలాలు

## ఉప్పలగుప్తం మండలం, మునిపల్లి గ్రామంలో జరిగిన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్న శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు





**ఉప్పలగుప్తం, జులై15 (తెలుగురాష్ట్రం విలేఖరి):** ఉప్పలగుప్తం మండలం, మునిపల్లి గ్రామంలో జరిగిన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్న శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు . ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మాజీ zptc దేశంశెట్టి లక్ష్మీనారాయణ, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ లంకే భీమరాజు, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం, మాజీ mpp బొర్రా ఈశ్వరరావు, ఉప్పలగుప్తం మండల టిడిపి అధ్యక్షులు అరిగేలా నానాజీ, గ్రామకమిటీ అధ్యక్షులు నిమ్మకాయల సూర్యప్రకాష్ రావు, పోలిశెట్టి భూలోకం, నాగ సూర్యారావు, నిమ్మకాయల పద్మావతి, చిక్కం ఉమేష్, నిమ్మకాయల శ్రీ ఆంజనేయులు, నిమ్మకాయల వెంకటరామరావు, కోటిపల్లి రాంబాబు, నల్లా బాపండు, పెమ్మిరెడ్డి సత్తిబాబు మరియు తదితరులు పాల్గొన్నారు





## కార్పొరేషన్లో కారుణ్య నియామకాలు

### -నియామక పత్రాలు అందజేసిన కలెక్టర్ ప్రశాంతి



**రాజమహేంద్రవరం, జూల్కై 15 (తెలుగురాష్ట్రం విలేఖరి):** నగరపాలక సంస్థ కార్యాలయం నందు పనిచేస్తూ మరణించిన ముగ్గురు ఉద్యోగుల వారసులలకు కారుణ్య కారుణ్య నియామకాల పత్రాలు ఇస్తూ జిల్లా కలెక్టర్, కమిషనర్(ఎఫ్ఏసి) పి ప్రశాంతి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముగ్గురిలో ఇద్దరికి జూనియర్ అసిస్టెంట్, ఒకరికి పబ్లిక్ హెల్త్ వర్కర్గా కారుణ్య నియామక పత్రాలు ఇవ్వటం జరిగిందన్నారు. ఉద్యోగం పొందిన అభ్యర్థులు క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు. సీనియర్ల వద్ద పని మెళకువలు నేర్చుకుని సంస్థ పురోభివృద్ధికి తోడ్పడాలన్నారు. అదేవిధంగా అంకితభావంతో అప్పగించిన విధులు నిర్వర్తించి, తాము పనిచేస్తున్న శాఖల అధికారుల మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో అడిషినల్ కమిషనర్ పివి రామలింగేశ్వర్, ఆఫీస్ మేనేజర్ ఎండి అబ్దుల్ మాలిక్ పాల్గొన్నారు.

## ఎస్సీ ఎస్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని వినతి

### -షెడ్యూల్ కులాల జాతీయ కమిషన్ సభ్యులు రామచంద్రర్ కు వినతి పత్రాన్ని అందించిన ది బుదిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా సభ్యులు



**భీమవరం జూలై 15, (తెలుగురాష్ట్రం విలేఖరి):** ఇటీవల కాలంలో ఎస్సీ ఎస్టీల దళితులపై దాడులు జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ది బుదిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఏపీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్, బిఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కమిటీ పౌండర్ కోనా జోసెఫ్ కోరారు. మంగళవారం భీమవరం విచ్చేసిన జాతీయ షెడ్యూల్డ్ కులముల కమీషన్ మెంబర్ గవర్నమెంట్ అఫ్ ఇండియా వడ్డేపల్లి రామచందర్, జాతీయ షెడ్యూల్డ్ కులముల కమీషన్ డైరెక్టర్ గవర్నమెంట్ అఫ్ ఇండియా డా జి సునీల్ కుమార్ బాబుకు వినతిపత్రాన్ని అందించారు. జోసెప్ మాట్లాడుతూ స్త్రీలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయని, వర్గీకరణతో కొంతమంది మాలలు, మాదిగలు విడిపోయి ఘర్షణలకు లోనవుతున్నారని, ఎస్సీ ఎస్టీ కేసులు చాలా వరకు ఇంకా పెండింగ్ లోనే ఉన్నాయని, ఎస్టీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను సక్రమంగా అమలు చేయాలని అన్నారు. ఎస్సీ,ఎస్టీ,బిసి, మైనార్టీ వారు వేరే రాష్ట్రాలకు వెళ్లకుండా భీమవరంలోనే ఒక స్టడీ సెంటర్ ను ఏర్పాటు చేయాలని, నిరుద్యోగులకు లోన్ విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, ఎస్సీ పేటలలో డ్రైనేజీ సదుపాయాలను మెరుగు పర్చేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఈది రవికుమార్, కేసి రాజు, గంటా సుందర్ కుమార్, బి కమలాకర్, టీ ప్రశాంత్, పి ముసలయ్య, బుంగ ఆదమ్, టీ రాజశేఖర్, సంపత్ రావు, గాతల సందీప్, వి రత్నారాజు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డుల సమస్య పరిష్కరిస్తాం ..మాజీ ఎంపీ సీతారామలక్ష్మి



**భీమవరం జూలై 15, (తెలుగురాష్ట్రం విలేఖరి):** భీమవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో భీమవరం పట్టణ టిడిపి అధ్యక్షుడు మద్దులు రాము అధ్యక్షతన భీమవరం 4 వార్డు నరసయ్య అగ్రహారంలోని పట్టణ మాజీ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు ఇంటి వద్ద నుండి సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మీ మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకుని అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామన్నారు. రేషన్ కార్డుల ప్రక్రియలో సాంకేతిక ఇబ్బందులు వల్ల జాప్యం జరుగుతున్నట్లుగా గుర్తించామని, త్వరలోనే దీని సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, వెండ్ర శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు మద్దుల రాము, మాజీ అధ్యక్షులు ఇందుకురి సుబ్రహ్మణ్యరాజు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ శ్రీరామమ్మూర్తికి పుత్రిక వియోగం





**రాజమహేంద్రవరం, జూల్కై 15 (తెలుగురాష్ట్రం విలేఖరి):** సీనియర్ జర్నలిస్ట్, ప్రైమ్ న్యూస్ జిల్లా బ్యూరో, ఎపిడబ్ల్యూజె రాష్ట్ర నాయకులు మండెల శ్రీరామమ్మూర్తికి పుత్రిక వియోగం కలిగింది. ఆయన పెద్ద కుమార్తె తేజస్విని(28) సోమవారం మధ్యాహ్నం అస్వస్థతతో హఠాన్మరణం చెందారు. భర్తతో కలిసి యానంలోని బంధువుల ఇంటిలో ఒక వేడుకకు హాజరయ్యేందకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా తాళ్ళరేవు మండలం నీలపల్లి వద్ద తేజస్విని ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యారు. మంచినీళ్ళు తాగుతూ అక్కడే కుప్పకూలిపోయారు. చుట్టు పక్కల వారి సహాయంతో ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తేజస్విని భర్త సత్తి హరిశ్చంద్రప్రసాద్ సూరంపాలెం ఇంజనీరింగ్ కళాశాలలో అధ్యాపకునిగా పనిచేస్తున్నారు. తేజస్విని పార్థివ దేహాన్ని సోమవారం బొమ్మూరులోని శ్రీరామమ్మూర్తి స్వగృహానికి తరలించారు. కుమార్తె మరణంతో శ్రీరామమ్మూర్తి కుటుంబం దుఃఖ:సాగరంలో మునిగిపోయింది. తేజస్విని పార్థివ దేహాన్ని రాష్ట్ర పర్యాటక శాఖామంత్రి కందుల దుర్గేష్, రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు, వైసిపి సిజిసి సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, మాజీ ఎంపి మార్గాని భరత్ రామ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు టికె విశ్వేశ్వరరెడ్డి, సిసిసి ఎండి పంతం కొండలరావు, రూరల్ టిడిపి అధ్యక్షులు మత్స్యేటి ప్రసాద్, కాపు సంఘం నాయకులు రామినీడి మురళి, వీరబాబు, దేశరెడ్డి బలరామనాయుడు, పలువురు పాత్రికేయులు సందర్శించి, నివాళులర్పించారు. తేజస్విని మృతికి సంతాపం తెలియజేసి, శ్రీరామ్మూర్తి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తేజస్విని అంతిమయాత్ర మంగళవారం ఉదయం 10 గంటలకు బొమ్మూరు నుండి బయలుదేరి స్థానిక ఇన్నీసుపేట కైలసభూమికి చేరుకుంది. ఇన్నీసుపేట కైలసభూమిలో అంత్యక్రియలు పూర్తయ్యాయి. పాత్రికేయులు, వీడియో గ్రాఫర్లు, కెమెరామెన్లు హాజరయ్యారు.

## రైల్వే సమస్యలపై జీఎంతో ఎంపీ పురందేశ్వరి భేటీ



**రాజమహేంద్రవరం, జూల్కై 15 (తెలుగురాష్ట్రం విలేఖరి):** రాజమండ్రి పార్లమెంటు సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి మంగళవారం సికింద్రాబాద్లోని రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవను కలిసి, నియోజక వర్గ పరిధిలోని రైలు అభివృద్ధి ప్రణాళికలపై చర్చించారు. రైల్వే అధికారులు, అలాగే రైల్వే యూనియన్ నాయకుడు ఉన్ని కృష్ణన్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, కొవ్వూరు మున్సిపాలిటీ బిజెపి కౌన్సిలర్ పిఎం కృష్ణ తదితరులు పాల్గొన్నారు. రాజమండ్రి ప్రధాన రైల్వే స్టేషన్ అభివృద్ధికి 271 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసి ఆరు మాసాలు కావస్తున్నా, ఇంకా టెండర్లు పిలవలేదని జీఎం దృష్టికి ఎంపీ పురందేశ్వరి తీసుకొచ్చారు. వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని, 2027లో గోదావరి పుష్కరాల నేపథ్యంలో రాజమండ్రి రైల్వే స్టేషన్ అభివృద్ధి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకు రావాలని కోరారు. రెండు మూడు రోజుల్లో టెండర్లు పిలిచి, మొదటి దశ పనులు వెంటనే ప్రారంభిస్తామని జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ తెలియ చేశారు. గోదావరి స్టేషన్, కొవ్వూరు స్టేషన్లలో టాయ్లెట్స్ వంటి సౌకర్యాలు మెరుగు పరచాలని, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా పుష్కరాలలోగానే ఆయా పనులు పూర్తిచేయాలని ఎంపీ కోరారు. కరోనాకు ముందు వరకు కొవ్వూరు రైల్వే స్టేషన్లో 18 రైళ్లు ఆగేవని, ఇప్పుడు 8 రైళ్లు మాత్రమే ఆగుతున్నాయన్నారు. ముఖ్యంగా చెన్నై, తిరుపతి వెళ్ళడానికి కూడా రైళ్లు ఆగడం లేదని, సింహాద్రి ఎక్స్ప్రెస్ కూడా ఆపడం లేదని ఎంపీ ప్రస్తావించారు. ప్రజలకు ఉపయోగపడే ముఖ్యమైన తిరుమల, సర్కారు, సింహాద్రి ఎక్స్ప్రెస్ వంటి రైళ్లన్నీ ఆగేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా కరోనా ముందు రాజమండ్రి నుంచి తణుకు, భీమవరం, నరసాపురం వరకు ప్యాసింజర్ రైళు ఉండేవని, కరోనా సమయంలో వీటిని ఆపేశారని, వాటిని పునరుద్ధరించాలని కోరారు. కరోనా తర్వాత పునరుద్ధరించాలని చూసినప్పటికీ రాజమండ్రి నాల్గవ ఫ్లాట్ ఫారం పనుల కారణంగా నిడదవోలు నుంచి వెళుతున్నాయని అయితే రాజమండ్రి నుంచి యధావిధిగా మూడు ప్యాసింజర్ రైళ్లు పునరుద్ధరించాలని కోరారు. ఈ రైళ్ళ వలన విద్యార్థులకు, ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఎంపీ వివరించగా జీఎం సానుకూలంగా స్పందించారు. నిడదవోలు జంక్షన్లో రూ.150 కోట్లతో ఎలక్ట్రిఫికేషన్ పనులు, ఫ్లాట్ ఫారం 4, 5 పనులు కూడా పూర్తయినప్పటికీ మెయిన్ ల్కెన్లో కలపడానికి అవసరమైన ఆరు కోట్ల రూపాయలు విడుదల చేసి పనులు పూర్తిచేయాలని ఎంపీ కోరారు. కొవ్వూరు - భద్రాచలం రైల్వే ప్రాజెక్ట్ 40 ఏళ్లుగా పెండిరగ్లో ఉండడం, సర్వే జరిగినప్పటికీ పనులు పూర్తవ్వలేదన్న విషయాన్ని ఎంపీ ప్రస్తావించారు. రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం వాటా ఇవ్వాల్సి ఉందని, తెలంగాణ ప్రభుత్వం ఇవ్వడం వలన సత్తుపల్లి వరకు చేశామని, ఎపి ప్రభుత్వం కూడా ఇస్తే పూర్తిచేస్తామని జీఎం వివరణ ఇచ్చారు.

## 180 కేజిలతో బాలాత్రిపుర సుందరికి ఆషాఢ మాస సారే



**భీమవరం జూలై 15,(తెలుగురాష్ట్రం విలేఖరి):** భీమవరం మెంటేవారి తోటలోని శ్రీబాల త్రిపుర సుందరి దేవి అమ్మవారికి మంగళవారం 180 కేజిలతో ఆషాఢ మాస సారే అందించారు. తోటకూర కృష్ణ, ఫణిలక్ష్మి దంపతుల సహకారంతో ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ముందుగా 108 మహిళలచే ఆలయ ప్రాంగణం నుంచి మెంటేవారి తోటలో 180 కేజిలతో ఆషాఢ మాస సారే తో ఊరేగింపు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

## ఇచ్చిన ప్రతీ హామీని అమలుచేస్తున్నాం

### - కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు





**కొత్తపేట, జూలై 15, (తెలుగురాష్ట్రం విలేఖరి):** ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మంగళవారం కొత్తపేట మండలం బిళ్లకుర్రు, వానపల్లి గ్రామాల్లో ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జరిగిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించడం ద్వారా మహిళలకు భారం తప్పిందన్నారు. తల్లికి వందనంతో ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి నగదు జమ చేసామన్నారు. వైసీపీ హయాంలో గ్రామాల్లో ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా జరగలేదని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే ఎన్నో పనులు చేపట్టామని ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన పలువురు ఎమ్మెల్యే బండారు వద్ద తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


## అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమం అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం...

### -చంద్రన్న పాలనలో రాష్ట్రం మెరుగైన పరిపాలన వైపు ముందడుగు వేస్తుంది...-హుకుంపేట గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గోరంట్ల...



**రాజమహేంద్రవరం, జూలై 15, (తెలుగురాష్ట్రం విలేఖరి):** అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమం అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, చంద్రన్న పాలనలో రాష్ట్రం మెరుగైన పరిపాలన వైపు అడుగులు వేస్తుందని, రూరల్ శాసనసభ్యులు శ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. ఈరోజు రూరల్ మండలం హుకుంపేట గ్రామం నందు యువ నాయకులు రాష్ట్ర హెల్త్ వింగ్ ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవి రామ్ కిరణ్ మరియు స్థానిక నాయకులతో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, రాష్ట్రం అభివృద్ధి వైపు దూసుకెళుతుందని తెలియజేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అలాగే స్థానిక సమస్యలను వింటూ, సత్కర పరిష్కారం చేస్తూ వివరాలను టెలిగ్రామ్ బాట్ నందు అప్లోడ్ చేశారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ సంవత్సర కాలంగా అభివృద్ధి వైపు ఆంధ్రప్రదేశ్ దూసుకు వెళుతుందని, గత ప్రభుత్వం చేసిన నిర్వాకం వల్ల జరిగిన నష్టాలు అన్నిటిని భర్తీ చేసుకుంటూ, ఆర్థిక లోటుపాట్లను సరి చేసుకుంటూ, ఇచ్చిన వాగ్దానాలన్నీ అమలు చేసుకుంటూ కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందని అన్నారు. గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి ధ్యేయంగా ప్రణాళికతో వెళుతున్నామని, వాటిలో భాగంగా గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా ప్రజల అభీష్టం మేరకు రోడ్లు మరియు డ్రైనేజీలు నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళుతున్నామని ప్రజలు సానుకూలంగా స్పందిస్తున్నారని, చెప్పినవన్నీ అమలు చేస్తున్నందుకు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎం.సీ చైర్మన్ మార్ని వాసుదేవ్, మండల తెదేపా అధ్యక్షుడు మత్స్యేటి ప్రసాద్, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి, దుద్దుపూడి రామకృష్ణ, దుద్దుపూడి రమేష్, బొప్పన నానాజీ, పెండ్యాల రామకృష్ణ, మంద బిందు, బొప్పన శ్రీను, వల్లేపల్లి సుబ్రహ్మణ్యం, యలమాటి రామకృష్ణ, అల్లూరి నరసింహ, కోటిపల్లి చంద్రశేఖర్, చక్రయ్య, దుద్దుపూడి అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి లోకేష్ ను కలిసిన శాసన మండలు సభ్యులు సోమువీర్రాజు.



**రాజమహేంద్రవరం, జూలై 15, (తెలుగురాష్ట్రం విలేఖరి):** ఉండవల్లి ముఖ్యమంత్రి నివాసంలో మంత్రి నారా లోకేష్ ని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసిన శాసన మండలి సభ్యులు సోము వీర్రాజుఈ సందర్భంగా విద్యా శాఖ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ కార్యక్రమాన్ని ప్రశంసించిన సోము వీర్రాజు.విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే అంశంలో గురువులతోపాటు తల్లిదండ్రులను కూడా భాగస్వామ్యం చేసి వారి ప్రతిభను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తరపున చేస్తున్న కృషిని కొనియాడుతూ భవిష్యత్తులో మరింత ఉత్సాహవంతంగా

ఉభయ గోదావరి
https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక


# సుపరిపాలన చంద్రబాబు సంకల్పం



వి ఆర్ పురం, జులై 15 (తెలుగురాష్ట్రం విలేఖరి): ప్రతి గ్రామానికి మంచి పాలన ప్రతి ఇంటికి సంక్షేమం తీసుకువెళ్లాలని చంద్రబాబు సంకల్పం. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం బూత్ కన్వీనర్ ముత్యాల భాను ఆధ్వర్యంలో రాజుపేట పంచాయతీ సీతంపేట గ్రామంలో కరపత్రాలు పంచుతూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వెంటనే ఆ సమస్యలను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నారని ప్రభుత్వ పథకాలను సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ రాజపేట గ్రామపంచాయతీ 392 కుటుంబాలకు కరపత్రాలు పంచుతూ ప్రచారానికి సీతంపేట గ్రామం వెళ్లడం జరిగింది. కన్వీనర్ కి ఎదురైనా ప్రధాన సమస్యలు , ఉచిత గ్యాస్ దీపం పథకం డబ్బులు ఖాతాలో జమ కాలేదని, మంచినీరు ఒక ఇంటికొస్తే మరో ఇంటికి రావడం లేదని , వీధి రోడ్లు మంచిగా లేవని, కొత్త పెన్షన్లు ఎప్పుడు పెడతారని కన్వీనర్కి తెలియజేయడం జరిగింది. ఇండియన్ గ్యాస్ వినియోగదారులు చింతూరు పాయింట్ నుండి వంశీ రేఖపల్లి గ్యాస్ పాయింట్ కు బదిలీ చేయవలసిందిగా గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో కోట్ల వాసుదేవరావు, కోట్ల శ్రీను, కోట్ల సుధాకర్, కోట్ల రవికుమార్, కోట్ల రాంబాబు, కోట్ల లక్ష్మణరావు, ముత్యాల నరేష్, పొడ్తుల సత్యనారాయణ, కోట్ల రాజ్యం, కన్వీనర్ ముత్యాల భాను, పెట్ట రాజు తదితరులు పాల్గొన్నారు.

# రక్త దానం చేసిన సామాజికవేత్త కోట

అంబాజీపేట, జూలై 15 (తెలుగు రాష్ట్రం విలేకరి):




మండలానికి చెందిన సామాజిక వేత్త పంచాయతీ వార్డు సభ్యులు కోట హనుమంతురావు 55 వ సారి రక్తదానం చేసి మానవత్వం చాటుకున్నారు. అనారోగ్యం తో బాధపడుతూ ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న వైస్సార్సీపీ నాయకులు మైలే అనందరావు కు ఆయన రక్తదానం చేశారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వారితో పాటు అనారోగ్యం తో బాధపడుతున్న వారికి రక్తదానం చేసి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా హనుమంతురావును పలువురు అభినందించారు.

# మహేష్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే పొన్నాడ



# పుట్టినరోజు వేడుకలు

ముమ్మిడివరం, జూలై 15 (తెలుగురాష్ట్రం విలేఖరి): ముమ్మిడివరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వైసీపీ ఇంచార్జి పొన్నాడ వెంకట సతీష్ కుమార్ పుట్టినరోజు ను పురస్కరించుకొని మండల యువజన విభాగం అధ్యక్షులు విత్తనాల మహేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అభిమానులు, గ్రామ వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు దంపతులు.



పోలవరం, జూలై 15 (తెలుగు రాష్ట్రం విలేకరి): పోలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తన సతీమణితో కలిసి మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు నియోజకవర్గ ప్రజల శాంతి, సుభిక్షత, సౌఖ్యసంతోషాల కోసం శ్రీ వెంకటేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమల దేవస్థానంలో జరిగిన ఈ పూజా కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి గడ్డమనగు రవికుమార్, ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, జనసేన నాయకులు కుమార్ నాయుడు దంపతులు పాల్గొన్నారు. ప్రముఖ నేతల సమక్షంలో శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు, తిరుపతిలో భక్తుల సహితంగా ధార్మికవాతావరణంలో కొన్ని నిమిషాలు గడిపారు.

# పేకాట శిబిరాలపై దాడులు



టీ. నర్సాపురం, జూలై 15 (తెలుగు రాష్ట్రం విలేఖరి): టీ.నరసాపురం మండలం వల్లంపట్ల పంచాయతీ పరిధిలోని సింగరాయపాలెం గ్రామ శివారులో పోలీసులు పేకాట శిబిరం పై దాడులు నిర్వహించి 8 మంది వ్యక్తులను అదుపులోనికి తీసుకుని వారి వద్ద నుండి రూ.40,500 రూపాయలు నగదు మరియు 12 మోటార్ సైకిల్ లను స్వాధీనం చేసుకున్నారు. పోలవరం డిఎస్పి ఎం. వెంకటేశ్వరరావు, జీలుగుమిల్లి ఇన్స్పెక్టర్ బి వెంకటేశ్వరరావు, యొక్క ఆదేశాలపై. 15.07.2025 వ తేదీ మధ్యాహ్నం సుమారు 12:00 గం.ల సమయంలో, టీ.నరసాపురం పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీ ఎం. జయబాబు రాబడిన సమాచారం పై సిబ్బందితో కలిసి టీ.నరసాపురం మండలం, వల్లంపట్ల పంచాయతీ పరిధిలోని సింగరాయపాలెం గ్రామ శివారులో ఉన్న పేకాట శిబిరం పై ఆకస్మికంగా దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న 8 మంది వ్యక్తులు అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.40,500/- నగదు, 12 మోటార్ సైకిళ్లు, మరియు పేక ముక్కలు స్వాధీనం చేసుకొని, సంబంధిత వారిపై కేసు నమోదు చేసినారు. ఈ సందర్భంగా ఎస్ఐ జయ బాబు,మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు టీ.నరసాపురంలో తావులేదని, పేకాట, గ్యాంబ్లింగ్ వంటి చట్టవ్యతిరేక చర్యలపై నిరంతరం దాడులు నిర్వహిస్తామని హెచ్చరించారు. యువత అసాంఘిక కార్యకలాపాల వైపు మళ్లకుండా జాగ్రత్త పడాలని, ఇటువంటి అక్రమాలకు పాల్పడితే కఠినమైన చర్యలు తప్పవని ప్రజలకు సూచించారు. పౌరులు తమ గ్రామాల్లో జరుగుతున్న అన్యాయమైన, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలి, సమాచారం అందించిన వారి యొక్క వివరాలను గోప్యంగా ఉంచుతామని ఈ సందర్భంగా టీ నరసాపురం ఎస్ఐ జయ బాబు తెలిపారు

# గ్రీన్ ఫిల్డ్ హైవే పక్కన సర్వీస్ రోడ్డు వేయాలి



టీ.నర్సాపురం, జులై 15( తెలుగు రాష్ట్రం విలేఖరి): గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం ముందు రైతులకు పొలాల్లోకి వెళ్ళటానికి గ్రావెల్ రోడ్లు వేస్తామని అలాగే హైవే పక్కన సర్వీసు రోడ్డు వేస్తామని చెప్పి ఈనాడు కనీసం రైతులు తమ పొలాల్లో నుంచి పంట తెచ్చుకోవడానికి వీలు లేకుండా పెద్ద పెద్ద గోతులు ఉంచి అలాగే స్తంభాలు పాతి వలలు వేశారని మండల కేంద్రమైన టీ నర్సాపురంలో ఎగ్జిట్ రోడ్డు ఇవ్వాలని రైతులు టీ నర్సాపురంలో మక్కినవారిగూడెం రోడ్డులో హైవే రోడ్డు వద్ద సమావేశం నిర్వహించి ప్రభుత్వానికి పంపడానికి నివేదిక తయారు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ హైవే వారు ఇచ్చిన మాట ప్రకారం రైతులకు పొలాల్లోకి వెళ్లడానికి రోడ్డు అలాగే పంట బయటికి తెచ్చుకోవడానికి సర్వీస్ రోడ్డు వెంటనే వేయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులను ఆదుకోవాలని ప్రభుత్వం వెంటనే సర్వీస్ రోడ్లు రైతులకు పంట పొలాల్లోకి వెళ్ళటానికి గ్రావెల్ రోడ్లు వేసేలా హైవే కాంట్రాక్టర్లకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. దీనిపై మండలంలోని రైతులందరూ త్వరలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టడానికి సిద్ధంగా ఉంటున్నామని ఈ కార్యక్రమానికి ఒక కమిటీని వేసుకొని మండలంలోని రైతులందరూ సమిష్టిగా పోరాటం చేయడం జరుగుతుందని తెలిపారు.

# భర్త కనపడట్లేదని భార్య ఫిర్యాదు




టి నర్సాపురం, జులై 15 (తెలుగు రాష్ట్రం విలేకరి): టీ.నర్సాపురం మండలం బొర్రంపాలెం గ్రామానికి చెందిన షేక్ మీరా సాహెబ్ 50 సంవత్సరాల అనే వ్యక్తి గత కొంతకాలం నుండి షుగర్ వ్యాధితో బాధపడుతున్నారని మతిస్థిమితం లేక 8 -7-2025వ తారీకు తెలవారు జామున వెళ్లిపోవడంతో అతని ఆచూకీ కోసం ప్రయత్నించి చివరకు అతనిభార్య షేక్ మహబూబ్ సుభాని ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుఎస్సై జయ బాబు తెలిపారు.


# పార్టీలో సముచిత స్థానం కల్పించండి

## -కంభంపాటి మాధవి



విజయవాడ, జూలై 15 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి ): నగరానికి చెందిన సామాజిక వేత్త బీజేపీ మహిళా నాయకురాలు కంభంపాటి మాధవి మంగళవారం రాష్ట్ర భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పి వి ఎస్ మాధవ్ బీజేపీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో తనకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. 2024 ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేసానని పార్టీలో సముచిత స్థానం కల్పిస్తే బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆమె తెలిపారు.

# తెలంగాణ బీజేపీ అధ్యక్షుడుని సత్కరించిన జగ్గయ్యపేట కన్వీనర్ మన్నె



జగ్గయ్యపేట, జూల్కై 15 (తెలుగురాష్ట్రం విలేకరి): తెలంగాణ హైకోర్టు న్యాయవాది నారపరాజు రామచంద్రరావు తెలంగాణ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు గా నియమితులై జిల్లాల పర్యటన ప్రారంభించాటానికి వారి స్వగ్రామం నుండి శ్రీకారం చుట్టారు. కోదాడ మండలం నల్లబండగూడెం నుండి ప్రారంభమైన వారి పర్యటన సందర్భంగా వారి స్వగ్రామం జగ్గయ్యపేట నియోజకవర్గం సరిహద్దు నకు సమీపంలో ఉన్న గ్రామం. జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ మన్నె శ్రీనివాసరావు వారిని కలిసి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కోదాడ పర్యటనకు వచ్చినప్పుడు జగ్గయ్యపేట నియోజకవర్గం సందర్శించి ముఖ్యమైన దేవాలయాలను సందర్శించాలని కోరడం జరిగింది. వారు చిన్న నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ జగ్గయ్యపేట నియోజకవర్గం తో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. తరువాత కోదాడ లో జరిగిన మేధావుల ఆత్మీయ సమావేశంలో పాల్గొని మాట్లాడారు.

# భూ కబ్జాదారులకు అడ్డాగా ఓజిలి మండల రెవెన్యూ అధికారులు



నాయుడుపేట, జూలై 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి): తిరుపతి జిల్లా ఓజిలి మండలం రెవెన్యూ పరిధిలో ఉన్న అత్తివరం గ్రామంలో ల్యాండ్ సర్వే నెంబర్ 330/1 లో విస్తీర్ణం 4.20(నాలుగు ఎకరాల 20 సెంట్లు) దందోలు పెంచలయ్య %వా/ఉ% పెంచలయ్య కు ప్రభుత్వం పట్టా ఇచ్చిన తేదీ 15/06/1961 సంవత్సరంలో అందజేశారు. ఆ పట్టాదారును వయసు అప్పుడు 25 సంవత్సరాలు. ప్రస్తుతము వేరొకరికి నకిలీ పట్టాగా తయారుచేసి ఒకే పేరు ఉన్న మరొకరికి దందోలు పెంచలయ్య %వా/శీ% పర్రయ్య కు పట్టాను తయారుచేసి రెవెన్యూ వాళ్లు 04/02/2012 వ సంవత్సరం లో ఇవ్వడం జరిగింది. ఇన్ని సంవత్సరాల తర్వాత ఆ నకిలీకి పట్టా ఎలా వచ్చింది? దీంట్లో మతలబ%శీ% ఏమిటి ? ఇదంతా రెవిన్యూ కను సన్నల్లో జరిగిందా లేదా మాయాజాలమా ? ఈ విషయమై బాధితుడు పలుమార్లు కలెక్టరేట్ కార్యాలయం చుట్టూ తిరిగిన ఫలితం లేకుండా పోయిందని అత్తివరం గ్రామ ప్రజల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏం జరుగుతుంది ఓజిలి రెవెన్యూలో తెలియాల్సి ఉంది. అధికారులు ఇప్పటికయినా స్పందించి బాధితులకు న్యాయం చెయ్యాలని కోరుతున్నారు.

# గురుకుల పాఠశాల విద్యార్థులకు కాస్మెటిక్స్ చార్జీలు పెంచాలి



ముమ్మిడివరం, జూలై 15 (తెలుగు రాష్ట్రం విలేకరి): తానే లంక గురుకుల పాఠశాలలో 5 వ తరగతి నుండి 9 వ తరగతి వరకు అడ్మిషన్లు సంబందించిన కౌన్సిలింగ్ నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులు వేల సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్బంగా అల్ ఇండియా పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్ అప్పా ఆంధ్ర తెలంగాణ చైర్మెన్ పిల్లా చంద్రం మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో జాయిన్ అవ్వేందుకు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనడం శుభ పరిణామం అని కూటమి ప్రభుత్వం ఇది గమనించి మహనీయుడు ఎన్టీఆర్ సేవలతో బడుగు బలహీన వర్గాల అక్షరాన్ని అందుకున్నారంటే దానికి సంకేతం ఎన్టీఆర్ మాత్రమే ప్రస్తుతం ప్రభుత్వం సన్న బియ్యం అందించడం కూడా బడుగు బలహీన వర్గాల ఒక ముద్ద తినే అవకాశం కలిగింది కానీ ధరలకు అనుకూలంగా మెస్ చార్జీలు పెంచవలసిన అవసరం ఉందన్నారు. పేద విద్యార్థిని విద్యార్థులను ప్రభుత్వం దృష్టిలో ఉంచుకోవాలని కాస్మెటిక్స్ ప్యాకేజీ తక్షణమే అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. రెగ్యులర్ టీచర్స్ రెగ్యులర్ ప్రిన్సిపాల్ రెగ్యులర్ జిల్లా అధికారులను నియమించాలని నూతనముగా ప్రతి నియోజకవర్గంలో బాలబాలికలకు అదనముగా గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉన్నత చదువులు చదువుకొనుటకే గురుకుల డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేసి ఎన్నికలలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు దొండపాటి విజయసాగర్, జిల్లా అధ్యక్షులు రేవు సురేష్ బాబు, ఉపాధ్యక్షులు దాసరి రవి ప్రతాప్, జిల్లా కమిటీ సభ్యులు పచ్చిమల శ్రీను, జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పోలవరంలో పాము కాటు కేసులు




పోలవరం, జూలై 15 (తెలుగు రాష్ట్రం విలేకరి): కొత్తపట్టిసీమ గ్రామంలో ఉదయం రైతు కూలీలతో పాటు పొలంలోకి వెళ్తున్న శేఖర్ పొలం గట్లు మీద నడుస్తున్నప్పుడు గడ్డిలో ఉన్న పాము మీద కాలు వేయడంతో పాము కాటు వేయడం జరిగింది . వేంటనే పోలవరం మండలంలో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకురాగా అక్కడ నుండి వెంటనే రాజమండ్రికి తరలించారు. కాకా మండలంలో మరో వ్యక్తి కట్లపాము కాటుకు గురయ్యాడు పొలంలో పనిచేసే రైతులు కూలీలు పొలం పనికి వెళుతుంటారు వర్షాకాలంలో విష సర్పాలు ఎక్కువగా ఉండటం వలన ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి సేఫ్టీ షఉస్ ధరించాలి. వైద్యులు ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

# ఒలింపిక్స్‌లోకి క్రికెట్ రీఎంట్రీ.. షెడ్యూల్ రిలీజ్ !




క్రికెట్ అభిమానుల్లో పండుగ వాతావరణం నెలకొంది. సుమారు 128 సుదీర్ఘ సంవత్సరాల తర్వాత, క్రికెట్ మళ్లీ ఒలింపిక్స్ వేదికపై అడుగుపెట్టనుంది. లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్ 2028లో క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించనుండగా.. నిర్వాహకులు తాజాగా షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ వార్త ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ ప్రియులలో ఆనందోత్సాహాలను నింపింది.

**ఒలంపిక్స్ లో రీఎంట్రీ !**

క్రికెట్ చివరిసారిగా 1900లో పారిస్‌లో జరిగిన ఒలింపిక్స్‌లో ఆడారు. ఆ సమయంలో, గ్రేట్ బ్రిటన్ %-% ఫ్రాన్స్ మాత్రమే పాల్గొన్నాయి. చివరికి బ్రిటన్ రెండు రోజుల మ్యాచ్‌లో బంగారు పతకాన్ని గెలుచుకుంది. తర్వాత ఒక్కసారి కూడా ఈ గేమ్‌కు అవకాశం రాలేదు. ఇప్పుడు లాస్ ఏంజెలెస్ వేదికగా ఈ చారిత్రాత్మక రీఎంట్రీ జరగనుంది.

పురుషులు, మహిళలకు వేరే విభాగాలు ఈసారి క్రికెట్‌కి ప్రత్యేకత ఏంటంటే, పురుషులు - మహిళలు వేర్వేరు విభాగాల్లో పోటీ పడతారు. ప్రతి విభాగంలో ఆరు జట్లు బంగారు, వెండి, కాంస్య పతకాల కోసం పోటీపడతాయి. అన్ని మ్యాచ్‌లు T20 ఫార్మాట్‌లో జరగనుండగా.. దాదాపు ప్రతీ రోజు డబుల్-హెడర్ మ్యాచ్ లు జరగనున్నాయి.

**లాస్ ఏంజెలెస్ 2028 క్రికెట్ షెడ్యూల్**

**మహిళల క్రికెట్**

ప్రారంభ మ్యాచ్: జూలై 12, 2028
రెండవ మ్యాచ్: జూలై 13, 2028
మెడల్ మ్యాచ్‌లు: జూలై 20, 2028

**పురుషుల క్రికెట్**

ప్రారంభ మ్యాచ్: జూలై 22, 2028
మెడల్ మ్యాచ్‌లు: జూలై 29, 2028
మహిళల ఈవెంట్ ముగిసిన వెంటనే పురుషుల ఈవెంట్ ప్రారంభమవుతుంది. ఇలా జూలై నెల మొత్తం క్రికెట్ పండుగే%ా




**మ్యాచ్ వేదిక**

అన్ని మ్యాచ్‌లు ఫెయిర్‌గ్రౌండ్స్ క్రికెట్ స్టేడియంలో జరుగుతాయి. ఈ స్టేడియం డౌన్‌టౌన్ లాస్ ఏంజెలెస్‌కు 48 కిలోమీటర్ల దూరంలో, దాదాపు ఒక శతాబ్దంగా LA కౌంటీ ఫెయిర్‌కు ప్రసిద్ధిగా నిలిచింది. 2028 ఒలింపిక్స్‌లో ఇది ప్రపంచ క్రికెట్‌కు ఒక కొత్త కేంద్రంగా రూపుదిద్దుకుంటుంది.

**క్వాలిఫికేషన్ పై త్వరలో క్లారిటీ**


ఒలింపిక్ క్రికెట్ షెడ్యూల్ విడుదల అయినా, అంతర్జాతీయ క్రికెట్ మండలి (%×జజ%) ఇంకా క్వాలిఫికేషన్ ప్రక్రియపై నిర్ణయం తీసుకోలేదు. దీనిపై జూలై 17%-%20 మధ్య సింగపూర్‌లో జరగనున్న వార్షిక సమావేశంలో తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

**ఒలింపిక్స్‌లో క్రికెట్.. 128 తర్వాత మళ్లీ పోటీలు..**

2028 విశ్వక్రీడలు ఒలింపిక్స్ లాస్ ఎంజిల్స్‌లో జరగనున్నాయి. ప్రతీ ఒక్కరు ఆసక్తికరంగా ఎదురుచూసే ఈ క్రీడల్లో ఈసారి ఓ ప్రత్యేకత ఉంది. 2028 ఒలింపిక్స్‌లో క్రీడల్లో క్రికెట్ భాగం కానుంది. 128 ఏళ్ల తర్వాత క్రికెట్ ఒలింపిక్స్‌లో పునరాగమనం చేయనుంది. ఒలింపిక్స్‌లో క్రికెట్ పోటీలు జూలై 12, 2028 నుంచి ప్రారంభం అవుతాయి. ఈ మ్యాచ్‌లు లాస్ ఎంజిల్స్‌కి 50 కి.మీల దూరంలో ఉన్న పమోనాలోని ఫెయిర్‌ఫెక్స్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 500 ఏకరాల స్టేడియంలో జరుగుతాయి. ఒలింపిక్స్‌లో క్రికెట్ టి-20 ఫార్మాట్‌లో జరుగుతుంది. పురుషులు, మహిళలు మొతం ఆరు అంతర్జాయాయ జట్లు విశ్వ వేదకపై తలపడతాయి. గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ కోసం పోటీ జరుగుతుంది. జూలై 20 2028 మహిళలు, 29 పరుషలు తేదీల్లో జరుగుతాయి. ఒలింపిక్స్‌లో చివరిసారిగా 1900 సంవత్సరంలో క్రికెట్ మ్యాచ్ జరిగింది. అప్పుడు గ్రేట్ బ్రిటన్, ఫ్రాన్స్ మాత్రమే ఈ పోటీల్లో పాల్గొన్నాయి. టెస్ట్ ఫార్మాట్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో గ్రేట్ బ్రిటన్, ఫ్రాన్స్‌ని కేవలం రెండు రోజుల్లోనే ఓడించింది.





# 114 ఏళ్ల మారథాన్ పరుగుల వీరుడు రోడ్డు ప్రమాదంలో మృతి



మారథాన్ ను పూర్తి చేసిన అత్యధిక వయస్కుడిగా ప్రపంచ రికార్డు సృష్టించిన ఫౌజా సింగ్ ఓ రోడ్డు ప్రమాదంలో మరణించారు. సోమవారం జలంధర్ - పఠాన్ కోట్ జాతీయ రహదారిపై ఆయనను ఓ కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన ఫౌజా సింగ్ ను స్థానికులు హుటాహుటిన దగ్గర్లోని ఆసుపత్రిలో చేర్పించారు. ఈ ప్రమాదంలో ఫౌజా సింగ్ తలకు తీవ్ర గాయమైందని, రక్తస్రావం కారణంగా ఆయన తుదిశ్వాస వదిలారని వైద్యులు ప్రకటించారు. విదేశాల్లో ఉంటున్న ఆయన పిల్లలు వచ్చే వరకూ ఫౌజా సింగ్ మృతదేహాన్ని మార్చురీలో ఉంచుతామని వారు చెప్పారు. పంజాబ్ లోని జలంధర్ జిల్లా బేయాస్ గ్రామంలో 1911 ఏప్రిల్ 1న ఫౌజా సింగ్ జన్మించారు. ఆయనకు ప్రస్తుతం 114 ఏళ్లు. భార్య, కొడుకు మరణం తర్వాత ఫౌజా సింగ్ రన్నింగ్ ప్రాక్టీస్ చేశారు. 89 ఏళ్ల వయసులో మొదలు పెట్టిన పరుగును వందేళ్లు దాటినా ఆపలేదు. ఈ వయసులోనూ ఫౌజా సింగ్ ఉత్సాహంగా పరుగులు తీసి రికార్డులకెక్కారు. పలు మారథాన్లను పూర్తిచేసిన ఘనతను సొంతం చేసుకున్నారు. లండన్, న్యూయార్క్, టొరంటో లలో జరిగిన మారథాన్ లలో ఫౌజా సింగ్ పాల్గొన్నారు. ఫౌజా సింగ్ మరణంపై పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా విచారం వ్యక్తం చేశారు. వందేళ్లు దాటినా ఉత్సాహంగా పరుగులు తీస్తూ యువతకు ఆయన స్ఫూర్తిగా నిలిచారని అన్నారు.

# టీమిండియాకు కింగ్ చార్లెస్-3 ఆతిథ్యం.. లార్డ్స్ టెస్ట్‌లో సిరాజ్ ఓటమిపై ఏమన్నాడంటే..?

టీమిండియా మెన్స్, వుమెన్స్ జట్లు ఇంగ్లండ్‌లో పర్యటిస్తున్నాయి. శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని మెన్స్ టీమ్ ఐదు టెస్టుల సిరీస్‌ను ఆడుతున్నది. హర్మన్ ప్రీత్ కౌర్ నేతృత్వంలోని వుమెన్స్ టీమ్ మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఆడుతున్నది. ఇంతకుముందు ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఇంగ్లాండ్‌ను 3-2 తేడాతో ఓడించింది. రెండుజట్లకు కింగ్ చార్లెస్ ఆతిథ్యం ఇచ్చారు. లండన్‌లోని సెయింట్ జేమ్స్ ప్యాలెస్‌లో మంగళవారం రెండుజట్లు కింగ్ చార్లెస్-3ని కలిశాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మాట్లాడుతూ కింగ్ చార్లెస్‌ను కలిసి మాట్లాడడం బాగుందన్నారు. మహ్మద్ సిరాజ్ అవుట్ అయిన విధానంపై కింగ్ ఛార్లెస్ స్పందించారని చెప్పాడు. లార్డ్స్ టెస్టులో చివరి బ్యాట్స్‌మెన్ అవుట్ అయిన తీరు దురదృష్టకరమని అన్నారని కెప్టెన్ పేర్కొన్నాడు. మ్యాచ్‌లో ఫలితం ఎలాగైనా ఉండవచ్చని ఆయనతో అన్నామని.. రాబోయే రెండు మ్యాచుల్లో మాకు అదృష్టం కలిసివస్తుందని ఆశిస్తున్నాం' అని అన్నట్లుగా గిల్ పేర్కొన్నాడు. లార్డ్స్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్ట్ మ్యాచ్ గురించి గిల్ మాట్లాడుతూ రెండు జట్లు ఆడిన విధానం బాగుందని.. చాలా ఉత్సాహాన్ని చూపించారని తెలిపాడు. తాము అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చామని చెప్పాడు. తాము అదృష్టవంతులమని.. ఎక్కడికి వెళ్లినా అభిమానుల నుంచి మంచి మద్దతు లభిస్తుందని చెప్పుకొచ్చాడు. లార్డ్స్ వేదికగా జరిగిన మూడో టెస్టు చివరి రోజు సోమవారం జోఫ్రా ఆర్చర్, బెన్ స్టోక్స్ అద్భుత బౌలింగ్‌తో టీమిండియా టాప్, మిడిలార్డర్‌ను కుప్పకూల్చారు. 193 పరుగుల విజయ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో టీమిండియా ఒక దశలో ఏడు వికెట్ల నష్టానికి 82 పరుగులు చేసి దాదాపు ఓటమి అంచుకు చేరుకుంది. అయినా, భారత జట్టు చివరి వరకు పోరాడింది. ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా 181 బంతుల్లో 61 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్ ఇద్దరూ అండగా నిలిచారు. కేవలం విజయానికి 22 పరుగుల దూరంలో ఉండగా భారత జట్టు చివరి వికెట్ రూపంలో సిరాజ్ అవుట్ అవడంతో టీమిండియా పోరాటం ముగిసింది.



# క్రికెటర్ యశ్ దయాల్‌కు ఊరట

నవతెలంగాణ - హైదరాబాద్: క్రికెటర్ యశ్ దయాల్‌కు ఊరట లభించింది. అతన్ని అరెస్టు చేయవద్దు అని అలహాబాద్ హైకోర్టు స్టే ఇచ్చింది. ఓ మహిళను లైంగికంగా వేధించినట్లు ఆ క్రికెటర్‌పై కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. ఐపీఎల్‌లో ఆర్సీబీ తరపున యశ్ దయాల్ ఆడుతున్నాడు. తదుపరి విచారణ వరకు అతనిపై ఎటువంటి చర్యలు తీసుకోవద్దు అని కోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్నది. ఈ విషయాన్ని అతని తరపు న్యాయవాది గౌరవ్ త్రిపాఠి పేర్కొన్నారు.






# రవీంద్ర జడేజా ఒంటరి పోరాటం..

## పలు రికార్డులు తిరగరాశాడు..

లార్డ్స్ మైదానంలో జరిగిన మూడో టెస్ట్‌లో టీం ఇండియా ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా చేసిన ఒంటరి పోరాటం వృధా అయింది. బ్యాట్స్‌మెన్లు అందరు త్వరగా ఔటైన నేపథ్యంలో టెయిల్ ఎండర్స్‌తో కలిసి జట్టును గెలిపించడానికి తీవ్రంగా కృషి చేశాడు జడ్డు. కానీ, ఆఖర్లో దురదృష్టం కొద్ది సిరాజ్ వికెట్ పడటంతో విజయం ఇంగ్లండ్‌ను వరించింది. అయితే మ్యాచ్ ఓడిపోయినప్పటికీ.. జడేజా పలు రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో 61 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచిన జడేజా.. అంతర్జాతీయ క్రికెట్‌లో ఏడు వేల పరుగుల మైలురాయిని చేరుకున్నాడు. తన కెరీర్‌లో 361 మ్యాచులు ఆడిన జడేజా 302 ఇన్నింగ్స్‌లో 7,018 పరుగులు చేశాడు. ఇందులో 39 అర్థశతకాలు ఉన్నాయి. 83 టెస్టులు ఆడిన జడేజా 3,697 పరుగులు చేశాడు. ఇందులో 4 సెంచరీలు, 26 అర్ధశతకాలు ఉన్నాయి. ఇక ఇంగ్లండ్‌లో నాలుగు లేదా అంతకంటే ఎక్కువ హాఫ్ సెంచరీలు చేసిన ఆటగాళ్ల లిస్ట్‌లో జడేజా మూడో స్థానంలో నిలిచాడు. ఈ లిస్ట్‌లో పంత్ ఐదు సార్లు, గంగూలీ నాలుగు హాఫ్ సెంచరీలు చేశారు. దీంతో పాటు లార్డ్స్‌లో రెండు ఇన్నింగ్స్‌లోనూ అర్ధశతకం (72,61) సాధించిన రెండో భారత క్రికెటర్‌గా జడ్డూ నిలిచాడు. గతంలో ఈ రికార్డు వినోద్ మాన్కడ్(1952లో 72, 184) పేరిట ఉండేది. అలాగే SENA దేశాల్లో టెస్టు మ్యాచ్‌లోని రెండు ఇన్నింగ్స్‌లో నెంబర్.6 లేదా అంతకంటే దిగువ స్థానాల్లో బ్యాటింగ్‌కు వచ్చి అర్ధశతకాలు చేసిన మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ, ఎంఎస్ ధోనీల సరసన జడ్డూ చేరిపోయాడు. ఆ తర్వాత ఆరు లేదా అంతకంటే దిగువ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి.. 29 హాఫ్ సెంచరీలు చేసిన జడేజా ఈ సందర్భంగా వివిఎస్ లక్ష్మణ్ (28) ను అధిగమించాడు. జడేజా కంటే ముందు కపిల్‌దేవ్(35), ధోనీ(38) ఉన్నారు.

# నాలుగో టెస్ట్‌కు ఇంగ్లండ్ జట్టు.. 8 ఏళ్ల తర్వాత అతనికి చోటు



లార్డ్స్ మైదానంలో భారత్‌పై విజయం సాధించి ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో 2-1 తేడాతో ఆధిక్యంలో ఉంది ఇంగ్లండ్ తాజాగా నాలుగో టెస్ట్ కోసం 14 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. ఈ జట్టులోకి ఎనిమిదేళ్ల తర్వాత ఎడమచేతి వాటం స్పిన్నర్ లియామ్ డాసన్ తిరిగి వచ్చాడు. లార్డ్స్‌లో గాయపడిన షోయబ్ బషీర్ స్థానంలో లియామ్‌ని జట్టులోకి తీసుకున్నారు. బషీర్ చేతి వేలికి గాయం కావడంతో అతను మిగితా రెండు టెస్టులకు దూరమైనట్లు ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఇసిబి) సోషల్‌మీడియా వేదికగా వెల్లడించింది. 2017లో లియామ్ డాసన్ చివరిసారిగా ఇంగ్లండ్ దక్షిణాఫ్రికా మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆడాడు. ప్రస్తుతం అతను దేశవాళీ క్రికెట్‌లో అద్భుతంగా రాణిస్తుండటంతో అతన్ని జట్టులోకి తీసుకున్నారు. ఇతర బ్యాటింగ్ కూడా మంచిగా చేస్తాడు. కాబట్టి తుది జట్టులో చోటు దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మూడు టెస్ట్‌లలో విఫలమైన జాక్ క్రాలీకి మళ్లీ అవకాశం ఇచ్చారు. అలాగే జట్టులో భాగంగా ఉన్న జేమీ ఓవర్టన్, సామ్ కుక్‌లు తిరిగి కౌంటఈ క్రికెట్ ఆడేందుకు వాళ్లను రిలీజ్ చేశారు. భారత్, ఇంగ్లండ్ మధ్య నాలుగో టెస్ట్ మాంచెస్టర్ వేదికగా జూలై 23 నుంచి ప్రారంభం కానుంది.

**నాలుగో టెస్ట్‌కు ఇంగ్లండ్ జట్టు**

బెన్ స్టోక్స్ (కెప్టెన్), జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్సన్, జాకబ్ బెథెల్ , హ్యారీ బ్రూక్, బ్రైడాన్ కార్స్, జాక్ క్రాలే, లియామ్ డాసన్, బెన్ డకెట్, ఓలీ పోప్, జో రూట్, జేమీ స్మిత్, జోష్ టంగ్, క్రిస్ వోక్స్.

# ఎపిఎల్‌లో అత్యధిక ధర పలికిన విశాఖ యువకుడు

విశాఖ : ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఎపిఎల్) సీజన్-4 లో తలపడే జట్ల క్రీడాకారులకు సోమవారం విశాఖలోని రాడిసన్ బ్లూ హెూటల్‌లో వేలం నిర్వహించారు. ఇందులో విశాఖకు చెందిన పైలా అవినాష్‌ను రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టు యాజమాన్యం అత్యధికంగా రూ.11.05 లక్షలకు కొనుగోలు చేసింది. మరో యువ క్రికెటర్ రిక్కీభుయ్ ని సింహాద్రి వైజాగ్ లయన్స్ జట్టు రూ.10.26 లక్షలకు దక్కించుకుంది. ఆ తర్వాత రూ.10.05 లక్షలకు పి.గిరినాథ్‌రెడ్డిని రాయల్స్ ఆఫ్ రాయలసీమ కొనుగోలు చేసింది. అనంతరం జి.హనుమవిహారిని అమరావతి రాయల్స్, అశ్విన్ హెబ్బార్‌ను విజయవాడ సన్‌షైనర్స్, షేక్ రషీద్‌ను రాయల్స్ ఆఫ్ రాయలసీమ, కె.నితీష్‌కుమార్‌రెడ్డిని భీమవరం బుల్స్, కె.ఎస్.భరత్‌ను కాకినాడ కింగ్స్ జట్లు రూ.10 లక్షల చొప్పున వెచ్చించి దక్కించుకున్నాయి. కార్యక్రమంలో ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ సుజయ్ కృష్ణ రంగారావు, ఏసీఏ ఉపాధ్యక్షుడు పి.వి.ఆర్.ప్రశాంత్, కౌన్సిలర్ దంతు విష్ణుతేజ్, గ్రౌండ్ డెవలప్‌మెంట్ జీఎం ఎం.ఎస్.కుమార్, ఆయా జట్ల యాజమాన్య ప్రతినిధులు పాల్గన్నారు.



తెలుగురాష్ట్రం దినపత్రిక

# ఎన్టీఆర్, ఎంజీఆర్ ప్రేరణతో పవన్ పాత్ర

## 'హరి హర వీరమల్లు' దర్శకుడు జ్యోతికృష్ణ



'హరి హర వీరమల్లు' చిత్రంలో పవన్ కళ్యాణ్ పాత్రను రూపొందించడానికి దిగ్గజ నటులు ఎన్టీఆర్, ఎంజీఆర్‌ల నుండి ప్రేరణ పొందా. గొప్పనటుల మాదిరిగానే పవన్ కళ్యాణ్‌లో ఉన్న అద్భుతమైన లక్షణా లను గమనించిన తర్వాతే ఆయన పాత్రను రాయడానికి పూనుకున్నా. ధర్మపరుడిగా, బలవంతుడిగా, ప్రజల మనిషిగా పవన్ కళ్యాణ్‌కి ఉన్న ఇమేజ్‌ను దృష్టిలో పెట్టుకొని పాత్రను జాగ్రత్తగా తీర్చిదిద్దా. 'ముఖ్య మంత్రి అయిన తర్వాత కూడా ఎంజీఆర్ గారు సందేశాత్మక, నిజాయితీతో కూడిన సినిమాలు చేస్తూ నట జీవితాన్ని కొనసాగిం చారు. ఈ అంశం నాకు స్ఫూర్తినిచ్చింది. అందుకే 'హరి హర వీరమల్లు'లో 'మాట వినాలి' అనే శక్తివంతమైన, ఆలోచింపజేసే పాటను స్వరపరి చాము. ఈ పాట ప్రేక్షకులను బాగా ప్రభావితం చేసింది. నటుడిగా ఎన్టీఆర్ గొప్ప ప్రదర్శనలు పౌరాణిక, జానపద చిత్రాల నుండి వచ్చాయి. ముఖ్యంగా రాముడు, కృష్ణుడు పాత్రలలో ఆయన ఒదిగిపోయిన తీరు చిరస్థాయిగా నిలిచిపోయింది. పవన్ గారి కోసం విల్లు, బాణాన్ని రూపొందించాము. కథనాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దేలా ప్రతి సన్నివేశాన్ని ప్రత్యేకంగా సృష్టించాలనుకున్నా' దర్శకుడు ఎం జ్యోతికృష్ణ అన్నారు. పవన్‌కళ్యాణ్, నిధి అగర్వాల్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'హరిహర వీరమల్లు'. ఈ సినిమా ఈనెల 24న విడుదల కానున్న నేపథ్యంలో ఈయన మీడియాతో పై విధంగా మాట్లాడారు.




# మంచి సందేశాన్నిచ్చే చిత్రం



తూలికా తనిష్క్ క్రియేషన్స్ బ్యానర్‌పై అభ్యుదయ దర్శకుడు బాబ్జీ దర్శకత్వంలో బెల్లి జనార్ధన్ నిర్మాతగా ఈ నెల 18న ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం 'పోలీస్ వారి హెచ్చరిక'.ఈ చిత్ర తొలి టికెట్ లాంచ్ చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిర్మాత బెల్లి జనార్ధన్ మాట్లాడుతూ మంచి కంటెంట్ ఉన్న ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరిస్తారని కోరుకుంటున్నానని తెలిపారు. దర్శకుడు బాబ్జి మాట్లాడుతూ "పోలీస్ వారి హెచ్చరిక చిత్రం ఇతర సినిమాల కంటే కాస్త భిన్నంగా ఉండబోతుంది. ఈ సినిమాలో నెగటివ్ క్యారెక్టర్ల మధ్య మంచి సన్నివేశాలు ఉండబోతున్నాయి. వారి మధ్య ప్రేమ, పాటలు ఉండబోతున్నాయి. ఒక మంచి సందేశాన్ని ఈ చి త్రంతో ప్రేక్షకులకు తెలుపబోతున్నాము"అని అన్నారు. ఈ కార్యక్రమంలో మట్టి కవి బెల్లి యాదయ్య, సన్నీ అఖిల్, జయ వాహిని పాల్గొన్నారు.

# 18న ఫస్ట్ సింగిల్

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని 'ఆంధ్ర కింగ్ తాలూకాలో రిఫ్రెషింగ్ అవతార్‌లో కనిపించనున్నాడు. ఇందులో అతను సినిమా అభిమానిగా అలరించనున్నాడు. మహేష్ బాబు పి దర్శకత్వంలో ప్రతిష్టాత్మక మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రొడక్షన్ చివరి దశలో ఉంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో కీలకమైన నెల రోజుల షెడ్యూల్ జరుగుతోంది. వివేక్,- మెర్విన్ ద్వయం స్వరపరిచిన మ్యూజిక్ ఆల్బమ్ నుంచి ఫస్ట్ సింగిల్ జూలై 18న విడుదలవుతుంది. ట్రాక్ కోసం ప్రమోషనల్ పోస్టర్‌లో రామ్ ఉత్సాహంగా తెరచాపతో నాటు పడవపై ప్రయాణిస్తున్నట్లు కనిపించడం ఆకట్టుకుంది. ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తుండగా, కన్నడ సూపర్ స్టార్ ఉపేంద్ర కీలక పాత్ర పోషిస్తున్నారు.




# తారక్- త్రివిక్రమ్ మూవీ..


## క్రేజీ అప్డేట్స్ ఇచ్చిన నాగవంశీ



ఇప్పుడు ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. వచ్చే ఏడాది మధ్యలో ఎన్టీఆర్- త్రివిక్రమ్ ప్రాజెక్ట్ ను ప్రారంభించాలని అనుకుంటున్నామని తెలిపారు.మ్యాన్ ఆఫ్ ది మాసెస్ జూనియర్ ఎన్టీఆర్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ కాంబినేషన్ లో మైథలాజికల్ మూవీ రానున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఆ సినిమాకు సంబంధించి పలు కీలక విషయాలు వెల్లడించిన నిర్మాత నాగవంశీ.. తాజాగా మరిన్ని విషయాలు పంచుకున్నారు. ప్రస్తుతం ఆయన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.బాల రామాయణంలో రాముడిగా నటించి కెరీర్ ను స్టార్ట్ చేసిన ఎన్టీఆర్.. ఇప్పుడు చాలా గ్యాప్ తర్వాత పౌరాణిక పాత్రను పోషించనున్నారు. త్రివిక్రమ్ మూవీలో మురుగన్ గా కనిపించనున్నారు. అందుకు గాను ఆయన ఫుల్ గా ప్రిపేర్ అవుతున్నట్లు తెలుస్తోంది. రీసెంట్ గా మురుగన్ బుక్ పట్టుకుని పలు సందర్భాల్లో కనిపించారు.అయితే సీనియర్ ఎన్టీఆర్ ను రాముడిగా, కృష్ణుడిగా మనం చూశామని, ఇప్పుడు తారక్ ను తాను అలా చూపించనున్నామని తాజాగా ఓ ఇంటర్వ్యూలో నాగవంశీ తెలిపారు. త్రివిక్రమ్ మొదటిసారి మైథలాజికల్ సినిమా తీస్తున్నారని చెప్పారు. ఇప్పుడు అనౌన్స్మెంట్ వీడియోపై మూవీ టీమ్ వర్క్ చేస్తుందని ఆయన వెల్లడించారు.బాలీవుడ్ రామాయణ ప్రాజెక్ట్ ను ప్రకటించిన తర్వాత దేశమంతా దాని గురించి మాట్లాడుకుందని గుర్తు చేశారు నాగవంశీ. తాము దానికంటే భారీగా.. ఉన్నత ప్రమాణాలతో తమ సినిమాను ప్రకటించాలని అనుకుంటున్నామని తెలిపారు. ఆ విషయంలో తాము తొందరపడడం లేదని పేర్కొన్నారు. అందుకే కొన్ని రోజులు ఆపామని అన్నారు.ఇప్పుడు ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. వచ్చే ఏడాది మధ్యలో ఎన్టీఆర్- త్రివిక్రమ్ ప్రాజెక్ట్ ను ప్రారంభించాలని అనుకుంటున్నామని తెలిపారు. 2026 ద్వితీయార్థంలో ఆ సినిమా సెట్స్ పైకి వెళ్తుందని చెప్పారు. వెంకటేష్ గారితో త్రివిక్రమ్ చేయాల్సిన మూవీ వచ్చే నెలలో స్టార్ట్ అవుతుందని అన్నారు.ఆ సినిమా 2026 వేసవిలో రిలీజ్ అవుతుందని తెలిపారు నాగవంశీ. అది జరిగిన వెంటనే తారక్ ప్రాజెక్ట్ స్టార్ట్ అవుతుందని చెప్పారు. ప్రస్తుతం ఆయన కామెంట్స్ నెట్టింట వైరల్ గా మారాయి. అయితే నాగవంశీ.. ఎన్టీఆర్, త్రివిక్రమ్ మూవీ ఎప్పుడు రిలీజ్ అవుతుందో చెప్పలేదు. బహుశా సీజీ, వీఎఫ్ ఎక్స్ వర్క్ కు ఎక్కువ సమయం పడుతుందేమోనని నెటిజన్లు అంచనా వేస్తున్నారు.

# విజయ్ ను టార్గెట్ చేశారు..

## కింగ్ డమ్ తో అందరి లెక్కలు తేలుస్తాడు



టాలీవుడ్ యంగ్ హీరో విజయ్ దేవరకొండకు ప్రస్తుతం సాలిడ్ హిట్ అవసరం. గీతా గోవిందం తర్వాత విజయ్ కు పెద్ద హిట్ పడలేదు. ఆ తర్వాత తీసిన సినిమాలు డియర్ కామ్రేడ్, లైగర్, ఖుషి, ఫ్యామిలీ స్టార్ ఆశించిన స్థాయిలో విజయం దక్కించుకోలేదు. ఆ క్రమంలోనే తన నటనకు బాగా ట్రోల్ అయ్యాడు కూడా.ఇక ప్రస్తుతం విజయ్ ఆశలన్నీ కింగ్ డమ్ సినిమాపైనే ఉన్నాయి. గౌతమ్ తిన్ననూరి తెరకెక్కించిన ఈ సినిమా ఈనెన 31న రిలీజ్ కానుంది. ఈ సినిమాపై విజయ్ కాన్ఫిడెంట్ గా ఉన్నాడు. కింగ్ డమ్ తన కెరీర్లో టర్నింగ్ పాయింట్ అవుతుందని నిర్మాత నాగవంశీ కుడా అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలోనే రీసెంట్గా ఓ సందర్భంలో మాట్లాడిన ఆయన, చాలా మంది విజయ్ ను తప్పుగా అర్థం చేసుకుంటున్నారని అన్నారు.విజయ్ దేవరకొండను ప్రజలు ఎందుకు టార్గెట్ చేస్తున్నారో నాకు అర్థం కావడం లేదు. కొన్ని ఫ్లాప్ ల కారణంగా విజయ్ కెరీర్ అనుకున్నట్లు సాగడం లేదు. ఇటీవల రెట్రో ప్రీ- రిలీజ్ ఈవెంట్ లో విజయ్ చేసిన చిన్న స్టేట్ మెంట్ ను తప్పుగా అర్థం చేసుకున్నారు. దీంతో అతను టార్గెట్ అయ్యాడు. అయితే కెరీర్ ప్రారంభంలో విజయ్ కాస్త దూకుడుగానే మాట్లాడేవాడు.కానీ, ఇప్పుడు పూర్తిగా మారిపోయాడు. ఆలోచించి ఆచితూచి మాట్లాడుతున్నాడు. కాంట్రవర్సీలకు దూరంగానే ఉంటున్నాడు. వాస్తవానికి ప్రజలు అతడిని తప్పుగా అర్థం చేసుకుంటున్నారు.వ్యక్తిగతంగా మాట్లాడితే తెలుస్తుంది విజయ్ అంటే ఏంటో. స్టేజ్ పై అగ్రెసివ్ గా మాట్లాడే విజయ్ ఆఫ్ ది కెమెరా కూల్ గా ఉండడం చూస్తే ఆశ్చర్యపోతారు.అసలు స్టేజ్ పై మాట్లాడే విజయ్, ఈ విజయ్ ఒక్కరేనా అనిపిస్తుంది. తనపై ప్రేక్షకులు కొంత్తైనా కరుణతో ఉండడం లేదు. అయితే కింగ్ డమ్ ఈ అడ్డంకులన్నింటినీ దాటుకుని సూపర్ హిట్ అవ్వాలని కోరుకుంటున్నా. అని ప్రొడ్యూసర్ నాగవంశీ అన్నారు. కాగా, ఈ సినిమా యాక్షన్ డ్రామా ఎంటర్టైన్మెంట్ జానర్గా తెరకెక్కింది. ఇందులో భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్ గా నటించింది.అయితే కెరీర్ తొలి నాళ్లలో విజయ్ పెళ్లిచూపులు, అర్జున్ రెడ్డి, గీతా గోవిందం వంటి సినిమాలతో సూపర్ హిట్ విజయాలు దక్కించుకున్నాడు. దీంతో టాలీవుడ్ లో తొందరగానే స్టార్ హీరోల లిస్ట్ లో చేరిపోతాడని అనుకున్నారంతా. కానీ, గీతాగోవిందం తర్వాత విజయ్ కు సరైన హిట్ రాలేదు. టాక్సీవాలా కొంతవరకూ ఆడినా, డియర్ కామ్రేడ్, లైగర్ పూర్తిగా నిరాశపర్చాయి.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339